
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

గురువారం 22 ఆగస్టు 2024





ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ భారత్ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో మాలమహానాడు ఆధ్వర్యంలో గుంటూరు లాడ్జి సెంటర్‌లో రాస్తారోకో జరిగింది. జిల్లాలో ఆర్టీసీ సర్వీసులు మధ్యాహ్నం 12 గంటల వరకు డిపోలకే పరిమితమయ్యాయి.

నాణ్యమైన విద్య అందించాలి

- విద్యార్థుల అభ్యున్నతికి అన్ని సౌకర్యాలు
- తుళ్లూరు జడ్పీ పాఠశాలలో కలెక్టర్ తనిఖీ
- విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించిన నాగలక్ష్మి

తుళ్లూరు, ఆగస్టు 21: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు అందిస్తుంది.. అని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. తుళ్లూరు కేవీఆర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా నైపుణ్యాల గురించి సుమారు గంట పాటు తరగతి గదిలో ఉండి స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల చేత బోర్డు మీద లెక్కలు చేయించారు. ఆ లెక్కల సమాధానాలు కరెక్టా కాదా అని తోటి విద్యార్థుల నుంచి చెప్పించారు. ఆన్సర్ కరెక్టు కావడంతో లెక్కలు చేసిన విద్యార్థిని కలెక్టర్ అభినందించారు. ట్యాబ్‌లలో జరిగే ఆన్‌లైన్


తరగతి గదిలో విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

పరీక్షల తీరును పరిశీలించారు. ఇంగ్లీషు భాషపై విద్యార్థులకు ఏ మాత్రం అవగాహన ఉందో స్వయంగా తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజనం గురించి ప్రశ్నించారు. ప్రధాన మంత్రి స్కూల్‌ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమం కింద నిర్మిస్తున్న ల్యాబ్‌ను, చదును చేస్తున్న ఆట స్థలాన్ని పరిశీలించి ప్రధానోపాధ్యాయుడు గుత్తా శ్రీనివాసరావుకు తగు సూచనలు చేశారు. గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉందని, ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి శిక్షణ అందించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. అనంతరం విలేకర్లతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదట విడతగా 21 పాఠశాలలు ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమం కింద ఎంపికైనట్లు తెలిపారు. తుళ్లూరు కేవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఎంశ్రీ కింద ఎంపికైందన్నారు. ల్యాబ్స్, కంప్యూటర్ ల్యాబ్, స్పోర్ట్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాబ్‌ల డెవలప్ జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు సీబీఎస్‌పై సమగ్ర శిక్షణ పొంది ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు వచ్చే మార్కుల బట్టి నగదు పారితోషకం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్షణ అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ విజయలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి దుర్గాబాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగజ్యోతి, ఎంపీడీవో శివన్నారాయణ, ఎంఈవోలు రాజుశేఖర్ అబ్దుల్ సుభాని, సెక్రటరి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు.. పండగే

- కేంద్రం నుంచి భారీగా నిధులు
- 1172 పంచాయతీలకు రూ.68.69 కోట్లు
- జడ్పీ, మండల పరిషత్‌లకు రూ.12.75 కోట్లు
- రెండు రోజుల్లో ఆయా ఖాతాలకు నిధుల జమ
- నిధులపై మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం
- శానిటేషన్, సీసీ రోడ్లు, డ్రెయినేజీ సమస్యలకు మోక్షం
- వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి బలైన పంచాయతీ వ్యవస్థ





పంచాయతీల బలోపేతం తోనే.. స్థానిక స్వపరిపాలన. పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్ఠతే అసలైన ప్రజాస్వామ్య స్ఫూర్తి. కానీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పంచాయతీలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. సచివాలయ వ్యవస్థతో పంచాయతీల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. ఇక నిధులను ఇవ్వక పోగా కేంద్ర ప్రభు త్వం జారీ చేసే ఆర్థిక సంఘం నిధులను కూడా జగన్ ప్రభుత్వం దారి మళ్లించుకుని దుర్వినియోగం చేసింది. ఒకవైపు హక్కులు, విధులు, నిధులు కోల్పోయి పంచాయ తీ పాలకవర్గాలు రోడ్డెక్కి ఆందోళనలు చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించు కోలేదు. నిధులు లేక కనీస పనులు కూడా చేయలేక పంచాయతీలు కునా రిల్లిపోయాయి. ఉనికే ప్రశ్నార్థకంగా మారిన పంచాయతీ రాజ్ వ్యవస్థకు కూటమి ప్రభుత్వంతో మళ్లీ పూర్వ వైభవం వస్తోంది. ఈ క్రమంలోనే గత ప్రభుత్వంలో దారి మళ్లిన ఆర్థిక సంఘం నిధులను తాజాగా పంచాయతీల ఖాతాలకు కూటమి ప్రభుత్వం జమ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పైగా ఐదేళ్ల వైసీపీ పాలనలో ఊసేలేకుండా పోయిన గ్రామసభల నిర్వహణకు కూడా కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొత్తంమీద మసకబారిన గ్రామ పంచాయతీల ప్రతిష్ఠ కూటమి ప్రభుత్వంతో తిరిగి ప్రకాశించనున్నది.

గుంటూరు, నరసరావుపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పంచాయతీలకు కూటమి ప్రభుత్వంలో మహర్దశ పట్టింది. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పూర్తిగా గాడి తప్పిన పంచాయతీరాజ్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. నిధుల విడుదల, గ్రామసభల నిర్వహణతో పంచాయతీలకు మంచి రోజులు రానున్నాయి. గత ప్రభుత్వ నిర్వాకంతో కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులను భారీ మొత్తంలో రాబట్టుకోవడంతో పాటు, వాటిని స్థానిక సంస్థల అభివృద్ధి పనులకే వినియోగించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో పంచాయతీరాజ్ వ్యవస్థకు ప్రాణం వచ్చినట్లయింది. కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను ఆయా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకే నేరుగా వచ్చేలా చర్యలు తీసుకుంది. వైసీపీ పాలనలో గడిచిన ఐదేళ్లుగా పంచాయతీల ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా లేదు. ఆఖరికి స్వాంతంత్ర్య, గణతంత్ర వేడుకలు చేయాలన్నా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఎవరో ఒకరు సొంత డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామ పంచాయతీలు పూర్తిగా నిరర్థకంగా తయారయాయి. అలాంటి దశలో నేడు గ్రామ పంచాయతీలకు భారీ మొత్తంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రావడంతో గ్రామాల్లో కొత్త కళ సంతరించుకోనుంది. గత ప్రభుత్వం నిధులు దారి మళ్లించి పారిశుధ్యాన్ని గాలికి వదిలేయడంతో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలన్నీ మూతపడిపో యాయి. యం త్రాలన్నీ తుప్పు పట్టి పాడైపోయాయి. తాజాగా నిధులు రావడంతో తిరిగి ఆ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. దీంతో పాటు గ్రామాల్లో మురుగునీటి వ్యవస్థ సమర్థవంతంగా నిర్వహిం చేందుకు డ్రెయినేజీల నిర్మాణానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆర్థిక సంఘం నిధులను సక్రమంగా వినియోగించుకోగలిగితే ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 2వేల కిలో మీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మించుకునే వీలు ఉంటుంది. స్థానిక సంస్థలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయగా కూట మి ప్రభుత్వం వాటి బలోపేతానికి చర్యలు తీసుకుంటోంది. నిధులను దారి మళ్లించగా ఆందోళనలు చేసిన పంచాయతీ పాలకవర్గాలపై జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది. సర్పంచ్ లను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తూ నిధుల విడుదలతో పాటు స్థానిక సంస్థల బలోపేతానికి చర్యలు చేపట్టడంపై వివిధ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

దారి మళ్లించిన వైసీపీ.. జమ చేసిన కూటమి

పంచాయతీలకు మూడు రకాలుగా ఆదాయం సమకూ రుతుంది. అయితే ఆర్థిక సంఘం నిధులే కీలకం. గ్రామాల్లో తక్కువ జనాభా ఉండడం, జీవన ప్రమాణాలు స్వల్పంగా ఉండడంతో పన్నుల ద్వారా వచ్చే ఆదాయం నామమాత్రమే. చిన్న పంచాయతీలైతే కనీసం 10 వేల రూపాయలు కూడా ఆదాయం రాదు. రెండో ఆదాయ వనరు నరేగా. వాటిని గ్రామీణ ఉపాధి హామీ పనులకు మాత్రమే వినియోగించు కోవాలి. దీంతో ఆ నిధుల వినియోగానికి పరిమితులు ఉన్నాయి. గత ప్రభుత్వం ఆ కార్యక్రమాన్ని సచివాలయాలు, విలేజ్ హెల్త్ సెంటర్లు, లైబ్రరీల నిర్మాణానికి వినియోగించింది. దీంతో ఆర్థిక సంఘం నిధులే పంచాయతీలకు దిక్కయ్యాయి. కేంద్రం ప్రభుత్వం 2024 మార్చి 28న 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధుల ను విడుదల చేసింది. ఈ నిధులను అప్పటి వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించి స్థానిక సంస్థలకు మొండి చేయి చూపింది. అడ్డదారు ల్లో ఆర్థిక సంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలోకి మళ్లించుకుంది. గ్రామీణాభివృద్ధికి తప్ప మరే విధంగానూ వినియోగించ రాదని తెలిసినా, ఆ నిధులను దారి మళ్లించింది. ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వైసీపీ ప్రభుత్వం లక్ష్య పెట్టలేదు. నిధుల్లేక కనీసం పారిశుధ్య పనులను నిర్వహించలేని దుస్థితిని పంచాయతీలు ఎదుర్కొన్నా.. సర్పంచ్‌లు రోడ్డెక్కి ఆందోళనలు చేసినా జగన్ ప్రభుత్వానికి పట్టలేదు. ఆర్థిక సంఘం నిధులు విడుదలైన వెంటనే ఒక్కో పంచాయతీలో రూ.3 నుంచి 5 లక్షల వరకు కరెంటు బిల్లులు, రాష్ట్ర ఖజానాకు జమయ్యే ఇతర చెల్లింపులకు వినియోగించింది. దీంతో పంచాయతీ నిధులు మొత్తం రాష్ట్ర ఖజానాకు జమయ్యేవి. చివరికి 2024 ఎన్నికలకు ముందు మార్చిలో విడుదలైన ఆర్థిక సంఘం నిధులను కూడా గత ప్రభుత్వం దారి మళ్లించింది. గ్రామ సభలు పెడితే ప్రజల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయని వాటిని కూడా పక్కన పెట్టేశారు. ఈ పరిస్థితికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. పంచాయతీరాజ్ వ్యవస్థకు తిరిగి ప్రాణం పోస్తూ స్థానిక స్వపరిపాలనకు రూపకల్పనకు నడుంకట్టింది. ఎన్నికల ముందు ఆర్థిక సంఘం నిధులను స్థానిక సంస్థలకు విడుదల చేసి వాటిని బలోపేతం చేస్తామని కూటమి నేతలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రకారం అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే నిధులను పంచాయతీలకు కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 23న రాష్ట్రంలోని అన్ని పంచాయతీలకు ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి, మంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించడంపైనా ఆయా వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. గ్రామ సభల్లోనే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు రచించి, ముందుకు సాగేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

నిధుల విడుదల ఇలా..

కేంద్రం నుంచి మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులు స్థానిక సంస్థల ఖాతాలకు రెండు రోజుల్లో జమ కానున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని 1172 పంచాయతీలు, గుంటూరు జిల్లా పరిషత్, మండల పరిషత్‌లకు కలిపి మొత్తం రూ.81.44 కోట్లు విడుదలయ్యాయి. జనాభా ప్రాతి పదికన పంచాయతీలకు నిధులను విడుదల చేశారు. పల్నాడు జిల్లాలో 519 పంచాయతీలకు రూ.29.50 కోట్లు, బాపట్ల జిల్లాలో 426 పంచాయతీలకు రూ.22.89 కోట్లు, గుంటూరు జిల్లాలోని 227 పంచాయతీలకు రూ.16.30 కోట్లు విడుదలయ్యాయి. ఇక గుంటూరు జిల్లా పరిషత్‌కు రూ.5.16 కోట్లు, మండల పరిషత్‌లకు రూ.7.59 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

వ్యయంపై మార్గదర్శకాలు..

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధుల వ్యయానికి సంబంధించి మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ప్రకారం స్థానిక సంస్థల్లో ప్రజల మౌలిక వసతులకు సంబం. ధించిన పనులను చేపట్టాలని ఆదేశించింది. జలవనరులను పెంపొందించుకునేందుకు చెరువులు, కుంటలు అభివృద్ధి, చెక్‌డ్యాంల నిర్మాణం, ఇంకుడు గుంతలు ఏర్పాటు, తాగు నీటి పథకాల అభివృద్ధి, పారిశుధ్యం మెరుగుదల, మరు గుదొడ్ల నిర్మాణం, వ్యర్థాల నిర్వాహణ తదితర పనులకు ప్రాధాన్యం కల్పించాలని సూచించింది. ఆర్థిక ఇబ్బందు లతో కునారిల్లుతున్న పంచాయతీలు ఈ నిధులతో కొంత మేర నిలదొక్కుకునే అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం విష జ్వరాలు, అడుగంటిన పారిశుధ్యం, దోమలు, అపరిశుభ్రత తదితర సమస్యలతో అల్లాడుతున్న గ్రామాల్లో ఆయా సమస్యలు తీరే అవకాశం ఏర్పడింది. 15వ ఆర్థిక సంఘం నిధులలో 50 శాతం నిధులు పారిశుధ్యంపైనే ఖర్చు చేయనున్నారు. ప్రధానంగా తడిచెత్త, పొడిచెత్త కార్యక్రమ నిర్వహణతో పాటు, చెత్త నుంచి సంపద సృష్టి కార్యక్రమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది.



నిధుల విడుదలపై హర్షం

ఆర్థిక సంఘం నిధులను స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంపై ఆయా పాలకవర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. గతంలో ఇదే నిధుల కోసం రోడ్డెకి ఆందోళనలు చేస్తే అప్పటి ప్రభుత్వం తమను నిర్ధాక్షణ్యంగా అరెస్టు చేసిందని, కొంతమందిపై కేసులు కూడా పెట్టిందని పలువురు తెలిపారు. చివరకు పంచాయతీల్లో చిన్నచిన్న పనులకు నగదు లేక భిక్షాటన చేసినా నాటి పాలకుల్లో చలనం లేకుండా పోయిందన్నారు. కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లుగానే నిధులు విడుదల చేసి కునారిల్లిపోతోన్న పంచాయతీలను పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నారని హర్షం వక్తం చేశారు. నిధుల విడుదలపై అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో కూడా పంచాయతీల నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేయాలని కోరారు. నిధుల విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు జాస్తి కృతజ్ఞతలు తెలిపారు.



పట్టాలెక్కుతున్న.. రైల్వే ప్రాజెక్టులు

- ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ పాలకులు
- టీడీపీ ప్రభుత్వం రాకతోనే మళ్లీ పనులు మొదలు
- 2014-19లో నడికుడి - శ్రీకాళహస్తి మార్గం పరుగులు
- అప్పట్లోనే గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ ప్రారంభం
- నేడు గుంటూరు - బీబీనగర్ రెండో మార్గం భూసేకరణ చకచకా
- త్వరలోనే అమరావతి కొత్త రైలుమార్గం నిర్మాణానికి అంకురార్పణ

గుంటూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రాజెక్టులు పట్టాలెక్కాలన్నా.. పనులు పరుగులు తీయాలన్నా.. టీడీపీ ప్రభుత్వం ఉండాల్సిందేనా. అంటే జరుగుతున్న పరిణామాలు అవునంటున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నడికుడి - శ్రీకాళహస్తి మార్గం, గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ పనులు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు గుంటూరు - బీబీనగర్ రెండో మార్గం భూసేకరణ, అమరావతి కొత్త రైలుమార్గం పనులు పట్టాలెక్కాయి. 2019 నుంచి 2024 మధ్య వైసీపీ హయాంలో రైల్వే ప్రాజెక్టులు ఊసే లేకుండా పోయింది. దీనిని బట్టి ఉమ్మడి గుంటూరు జిల్లాలో రైల్వే ప్రాజెక్టులు ముందుకు సాగాలంటే అధికారంలో తెలుగుదేశం పార్టీ ఉండాల్సిందేనని ప్రజలు భావిస్తున్నారు. ప్రాజెక్టులకు అవసరమైన భూముల సేకరణ, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇతర అనుమతులు, రైలు మార్గాల నిర్మాణానికి వినియోగించే సామగ్రిని సమకూర్చడం వంటివి టీడీపీ ప్రభుత్వానికే సాధ్యమని ఇటీవల ప్రారంభమైన పనులు చేస్తే ఎవ్వరికైనా అర్థం అవుతుంది. మారుమూల ప్రాంతాలకు రైలుమార్గాల ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందన్న సిద్ధాంతాన్ని టీడీపీ ప్రభుత్వం బలంగా విశ్వసిస్తుంది. ఈ కారణంగానే కొత్త రైల్వే ప్రాజెక్టు ఏది వచ్చినా అది సాధ్యమైనంత త్వరగా ముందడుగు వేసేందుకు అను వైన వాతావరణాన్ని కల్పిస్తున్నది. 2014-19 మధ్య కేంద్రంలో ఎన్‌డీఏ, ఇక్కడ టీడీపీ ప్రభుత్వాలు ఉన్నాయి. అప్పట్లో గుంటూరు-గుంతకల్లు రెండో రైలు మార్గం, నడికుడి - శ్రీకాళహస్తి న్యూ రైల్వే లేన్ ప్రాజెక్టులు జిల్లాకు మంజూరయ్యాయి. దాంతో వాటికి అవసరమైన భూములను సేకరించి ఇచ్చే బాధ్యతను అప్పటి టీడీపీ ప్రభుత్వం కలెక్టర్‌కు అప్పగిం చింది. దాంతో పిడుగురాళ్ల, రాజుపాలెం, నకరికల్లు, శావల్యాపురం, వినుకొండ తదితర మండలాల్లో భూములను సేకరించడంతో నాలుగేళ్ల క్రితమే 40 కిలోమీటర్లకు పైగా రైలు మార్గం నిర్మాణాన్ని పూర్తి చేసింది. ప్రస్తుతం గూడ్స్‌రైళ్లు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. త్వర లోనే ప్యాసింజర్ రైళ్లను పట్టాలెక్కించేందుకు ప్రయత్నాలు జరుగు తున్నాయి. మరోవైపు గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టుకి కూడా ప్రాధాన్యం ఇచ్చి భూములను సేకరించింది ఇచ్చింది. దీంతో ఇప్పటి వరకు నల్లమడ అటవీప్రాంతం వరకు రెండో మార్గం నిర్మాణం పూర్తి అయి రైళ్ల సమయపాలన గణనీయంగా పెరిగింది. కాగా వైసీపీ ప్రభు త్వ పాలనలో ఏ ఒక్క రైల్వే ప్రాజెక్టుకు ముందుకు సాగలేదు. కనీసం ఆర్‌వోబీ, ఆర్‌యూబీలకు కూడా మ్యాచింగ్ గ్రాంటుని విడుదల చేయలేదు.

ప్రస్తుతం చకచకా పనులు

టీడీపీ ప్రభుత్వం పరిపాలన ప్రారంభిస్తూనే గుంటూరు - బీబీనగర్ రైల్వే ప్రాజెక్టు నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే గుంటూరు జిల్లాలో 47 ఎకరాల భూమి సేకరణకు కాంపిటెంట్ అథారిటీ అయిన గుంటూరు ఆర్‌డీవో నోటిఫికేషన్ ఇచ్చారు. అలానే ఎక్కువ విస్తీర్ణంలో భూమిని సేకరించాల్సిన పల్నాడు జిల్లా పైనా దృష్టి కేంద్రీకరించింది. ఈ రైలు మార్గంలో ఎక్కువగా పల్నాడు జిల్లాలోని



వివిధ మండలాల మీదగా సాగనున్నది. దీంతో సత్తెనపల్లి మం డలంలోని ధూళిపాళ్లలో 12.36, కంకరణాలపల్లెలో 7.96, సత్తెనపల్లిలో 17.15, భీమవరంలో 5.13, అబ్బూరులో 2.08, గుడిపూడిలో 4.22 ఎకరాల భూమిని సేకరించేందుకు సత్తెనపల్లి ఆర్‌డీవో ద్వారా భూసేకరణ ప్రక్రియని ప్రారంభించింది. బెల్లంకొండ మండలంలో 11.73, పెదకూరపాడు మండలంలోని పెదకూరపాడు గ్రామంలో 11.18, లింగంగుంట్లలో 12.54, చినమక్కెనలో 0.68, రాజుపాలెం మండలంలోని చౌటుపాపాయపాలెంలో 13.69, రెడ్డిగూడెంలో 13.2, కుబాత్‌పురంలో 4.83, రాజుపాలెంలో 10.25 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ విధంగా 127.01 ఎకరాలను ఈ ఏడాది ఆఖరులోపే సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకొన్నది. మరోవైపు పిడుగురాళ్ల, దాచేపల్లి మండలాల్లోనూ భూములు సేకరించాల్సి ఉండటంతో అక్కడి ఆర్‌డీవో కూడా దీనిపై దృష్టి సారించారు.

అమరావతి రాజధానికి నూతన రైలుమార్గం నిర్మాణానికి సం బంధించి ఇప్పటికే డీపీఆర్‌ని కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. ఈ ప్రాజెక్టు కోసం గుంటూరు జిల్లాలో 407.73 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉన్నది. రైల్వే శాఖ ఎప్పుడు కోరితే అప్పుడు భూసేకరణ ప్రక్రియ ప్రారంభించేందుకు సంసిద్ధతని వ్యక్తపరిచింది. ఈ నేపథ్యంలో రైల్వే ప్రాజెక్టులు జిల్లాలో ముందడుగు వేయాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటేనే సాధ్యపడుతుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమౌతున్నది.

ఉమ్మడిగా.. రెవెన్యూ బదిలీలు

- ప్రత్యేక కమిటీని నియమించిన ప్రభుత్వం
- నోడల్ అథారిటీగా గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



గుంటూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో ఉద్యోగుల బదిలీలు ప్రస్తుత జిల్లాల్లోనే కాకుండా ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన కూడా జరగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నెల 19 నుంచి 31 మధ్య బదిలీల ప్రక్రియని పూర్తి చేయాల్సిందిగా ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన చేపట్టే తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్, తత్సమాన స్థాయి అధికారులు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టులు, వీఆర్‌వో గ్రేడ్-1, 2 ఉద్యోగుల బదిలీల కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ కమిటీకి గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి నోడల్ అథారిటీగా వ్యవహరిస్తారు. పల్నాడు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు సభ్యులుగా, మెంబర్ కన్వీనర్‌గా గుంటూరు డీఆర్‌వో ఉంటారు. ఈ కమిటీ భేటీ అయి ఉమ్మడి గుంటూరు జిల్లాలో బదిలీల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుంది. విభజన జరిగిన జిల్లాలో జరిగే తహసీల్దార్, వీఆర్‌వో గ్రేడ్-1 ఉద్యోగుల బదిలీలను కలెక్టర్, జేసీ, డీఆర్‌వో అధ్యక్షతన ఏర్పాటయ్యే కమిటీ చేపడుతున్నది. ఇక డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్, ఎంఆర్‌ఐ, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టుల బదిలీలు జాయింట్ కలెక్టర్, డీఆర్‌వో, కలెక్టరేట్ ఏవో కలిసి సమావేశమై చర్చించి నిర్ణయిస్తారు. తహసీల్దార్లు ఎవరైతే అంతర్ జిల్లాల బదిలీలు కోరుకుంటున్నారో వారి వివరాలను సీసీఎల్‌ఏకి పంపాలని ప్రభుత్వం ఆదేశించింది.



అవార్డులను చూపుతున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, అధ్యాపకులు

వీవీఐటీకి బెస్ట్ పెర్ఫార్మింగ్ ఇనిస్టిట్యూట్ అవార్డు

పెదకాకాని, ఆగస్టు 21: జేఎన్టీయూకే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ వర్సిటీ నిర్వహించిన వేడుకలలో భాగంగా అనుబంధ కళాశాలలకు అందించిన పురస్కారాలలో వీవీఐటీ కళాశాలకు బెస్ట్ పెర్ఫార్మింగ్ ఇనిస్టిట్యూట్ అవార్డు లభించిందని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బుధవారం తెలిపారు. దీంతోపాటు సీనియర్ ప్రిన్సిపాల్, ఉత్తమ అధ్యాపకులుగా అకడమిక్ డీన్ డాక్టర్ కే.గిరిబాబు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టీ.శ్రీనివాసరావులు పురస్కారాలు అందుకున్నారని ఆయన తెలిపారు. కాకినాడలో నిర్వహించిన జేఎన్టీయూకే 17వ ఆవిర్భావ దినోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ కే.రామ్మోహనరావు, జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ చేతులమీదుగా ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు గిరిబాబు, శ్రీనివాసరావు ఈ పురస్కారాలను అందుకున్నారన్నారు. అనంతరం పురస్కారాలను పొందిన అధ్యాపకులను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, సెక్రటరీ ఎస్.బదరీ ప్రసాద్, వైస్‌చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్‌లు అభినందించారు.

ఇన్‌-చార్జి వీసీతో స్కిల్ సిబ్బంది భేటీ

పెదకాకాని, ఆగస్టు 21: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావుతో యునివర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి, సిబ్బంది బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యునివర్సిటీలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై జరుగుతున్న కార్యక్రమాలు గురించి యూనివర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎస్‌కే మహమ్మద్ రఫీ, స్కిల్ కళాశాల కో-ఆర్డినేటర్ జీవీఎస్.సాయి కుమార్, వార్డెన్ ఎన్. కృపానందంలు వివరించారు. ఇందులో ముఖ్యంగా కాస్కేడింగ్ స్కిల్, ఎకో సిస్టం, స్కిల్ హబ్స్, స్కిల్ కళాశాల, స్కిల్ యూనివర్సిటీ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న స్కిల్ సైన్సెస్ కార్యక్రమాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఇన్‌చార్జి వీసీ సానుకూలంగా స్పందించి యూనివర్సిటీ కళాశాలల్లో విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ అభివృద్ధి కోసం చేపట్టే కార్యక్రమాలకు తగిన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.

23న జాబ్‌మేళా

గుంటూరు (విద్య), ఆగస్టు 21: గుంటూరు జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 23న ఉమ్మడి జిల్లా పరిధిలోని జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి కే.రఘు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పది నుంచి డిగ్రీ, పీజీ పూర్తయి, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలని అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు గుంటూరు గుజ్జనగుండ్లలోని కావూరి కాంప్లెక్స్‌లో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తారని తెలిపారు. ఇతర వివరాల కోసం 9866822697లో సంప్రదించాలని సూచించారు.

మాకు ప్రాణ రక్షణ కల్పించండి



మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న స్కౌట్ సిబ్బంది

- మంత్రి లోకేశ్ వద్ద వైసీపీ బాధితుల కన్నీటిపర్యంతం
- ఆందోళన వద్దు.. అండగా ఉంటానని మంత్రి హామీ
- 29వ రోజు ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరణ

తాడేపల్లి టౌన్, ఆగస్టు 21 : 'వైసీపీ రౌడీలు గొంతుపై కత్తిపెట్టి ఇంటిని, పొలాన్ని కబ్జాచేశారు. ఇంటిని ఆక్రమించారు. చంపుతామని బెదిరిస్తున్నారు...' అంటూ వైసీపీ బాధితులు ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్ ఎదుట కన్నీటిపర్యంతం అవుతున్నారు. ఉండవల్లి నివాసంలో 29వరోజు బుధవారం జరిగిన ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్ ప్రజల నుంచి వినుతులు స్వీకరించారు.

వైసీపీ రౌడీలు తన గొంతుపై కత్తిపెట్టి ఇంటిని, పొలాన్ని కబ్జా చేశారని గుంటూరు తెనాలికి చెందిన విశ్రాంత రైల్వే డ్రైవరు పిల్లి అబ్రహాం, కుమార్తె పిల్లి సుధారాణి మంత్రి నారా లోకేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ నేత, దుగ్గిరాల జడ్పీటీసీ దాసరి వీరయ్య, అతని అనుచరులైన రౌడీషీటర్, తెనాలి వన్ టౌన్ వైసీపీ కౌన్సిలర్ గడ్డేటి సురేంద్ర, గడ్డేటి బాలయ్య, రౌడీషీటర్ మహంకాళి, పిల్లి తిరుపతయ్య, మహేష్‌లు కలిసి వేధిస్తున్నారని కన్నీటిపర్యంతమ య్యారు. వృద్ధుడినైన తనపై దాడిచేసి చంపుతామని బెదిరిస్తు న్నారని, ఇంటిని ధ్వంసం చేసి బయటకు గెంటేశారని, వాపోయారు. దిక్కుతోచని స్థితిలో పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలే దన్నారు. పలు భూకబ్జాలు, హత్యలు సెటిల్‌మెంట్లు, కేసుల్లో ముద్దా యిలైన వైసీపీ రౌడీల బారినుంచి ప్రాణ రక్షణ కల్పించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



దివ్యాంగుల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్

మంగళగిరి నియోజకవర్గంలో సమస్యలిలా ...

కోవిడ్ సమయంలో భర్త చనిపోయాడని, కూలిపనులు చేసుకుని జీవనం సాగించే తనకు కుటుంబ పోషణ భారంగా మారిందని బీమా అందించడంతోపాటు ఆర్థిక సాయంచేసి ఆదుకోవాలని పెద వడ్లపూడికి చెందిన బీ.భారతి కోరారు. వైసీపీ ప్రభుత్వం తొలగించిన వృద్ధాప్య పెన్షన్‌ను పునరుద్ధరించాలని తాడేపల్లికి చెందిన నండూరి మురళీమోహన్ విజ్ఞప్తి చేశారు. దివ్యాంగ పెన్షన్ కోసం గత ప్రభుత్వంలో పలుమార్లు దరఖాస్తు చేసిన ఫలితం లేదని, తనకు దివ్యాంగ పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని యర్రబాలెం చెందిన షేక్ కరిమున్ కోరారు. ఇంటి స్థలం కేటాయించాలని మంగళగిరి కుప్పరావుకాలనీకి చెందిన ఏ.పుష్పావతి విజ్ఞప్తి చేశారు. ఐదు దశాబ్దాలుగా నివాసం ఉంటున్న తన ఇంటికి పట్టా మంజూరు చేయాలని తాడేపల్లికి చెందిన కొమ్మినేని సాంబశివరావు కోరారు. ఆయా విన్నపాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చారు.

రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన వినతులు ఇలా.....

కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని గుంటూరు జిల్లా, నారాకోడూరుకు చెందిన కోడూరు వినోద్‌కుమార్ మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. టీడీపీ సానుభూతిపరులంటూ చిత్తూరుజిల్లాలో పని చేసే పలువురు హోంగార్డులను అన్నమయ్య జిల్లాకు వెళ్లాలని గతంలో అధికారులు ఆదేశించారని సొంత జిల్లాలోనే విధులు నిర్వహించేలా తగిన ఉత్తర్వులిచ్చి న్యాయంచేయాలని హోంగార్డులు కోరారు. విజయనగరం జిల్లా కోనాడు జిల్లా పరిషత్‌పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, నైట్ వాచ్‌మెన్ సక్రమంగా విధులు నిర్వహంచడంలేదని వారిని తొలగించాలని పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, సభ్యులు విజ్ఞప్తి చేశారు. టీడీపీ సానుభూతిపరులనే నెపంతో గత ప్రభుత్వంలో 14 మందిపై అక్రమంగా నమోదు చేసిన కేసులను ఉపసంహరించేలా చర్యలు తీసుకోవాలని విజయ నగరం జిల్లా వెల్దూరు గ్రామ సర్పంచ్ నాయన సత్యవతి కోరారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్‌లో ఏడేళ్లనుండి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టాలని దరఖాస్తుదారులు విజ్ఞప్తి చేశారు. గ్రామ సచివాలయంలో పని చేసే సంక్షేమ, విద్యా సహాయకులను మాతృశాఖ అయిన సాంఘిక సంక్షేమశాఖలో విలీనం చేయడంతో పాటు వారి సమస్యలు పరిష్కరించాలని గ్రామ వార్డ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. వంశపారంపర్యంగా తనకు సంక్రమించిన 1.46 ఎకరాలను ఆన్‌లైన్ చేయడంతో పాటు పాస్ బుక్ మంజూరు చేయాలని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం గురిజేపల్లికి చెందిన వీరారెడ్డి విజ్ఞప్తిచేశారు. నకిలీ పత్రాలతో వంశపార్యంపర్యంగా వచ్చిన తమ రెండెకరాల పొలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారి జూలకంటి బుడే కబ్జా చేశాడని, విచారించి తగిన న్యాయం చేయాలని పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన మొక్కరాల నరసమ్మ కోరారు.

ఎలక్ట్రికల్ టెక్నీషియన్‌లో వెకేషనల్ కోర్సు పూర్తి చేసిన వారికి 11 కేవీఏ సబ్ స్టేషన్ ఆపరేటర్ పోస్టులకు అర్హత కల్పించాలని సత్యసాయి జిల్లా నిద్రగట్టుకు చెందిన ఎల్‌కే. ప్రశాంత్‌కుమార్ మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు.

సత్యసాయి వాటర్ సప్లై కార్మికులకు 6 నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, కార్మికులకు జీతాలు ఇవ్వడంతోపాటు ప్రాజెక్టుకు పూర్వ వైభవంకోసం చర్యలు తీసుకోవాలని అనంతపురం జిల్లా సత్యసాయి వాటర్ సప్లై వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు కోరారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 21: నాగార్జున సాగర్ జలాశయం నీటి మట్టం బుధవారం నాటికి 589.20 అడుగులు ఉంది. ఇది 309.65 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8144 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8280 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,826 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 47,650 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 47,650 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 26845 క్యూసెక్కులు

- టెయిల్‌పాండ్ ప్రాజెక్టులో 1.0615 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల,ఆగస్టు 21: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో మంగళవారం అర్థరాత్రి 12 గంటల వరకు 2 యూనిట్ల ద్వారా 1.0615 ఎంయూల విద్యుత్ తయారైనట్లు ఎస్ఈ కే.వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.. రెండు గేట్లను 1.5 మీటర్, ఒక గేట్‌ను మీటర్ మేర ఎత్తి 18419, టేల్‌రేస్ చానల్ ద్వారా 8426 మొత్తం 26845 క్యూసెక్కులను పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్ నుంచి 29 వేల క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. రిజర్వాయర్‌లో నీటిమట్టం 75.42 మీటర్లు ఉండగా, అది 7.025 టీఎంసీలకు సమానమని తెలిపారు.

బ్యారేజి దిగువకు 21,900 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 21: ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు నీటిని విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుండి 39వేల 544 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జెఈ అజముద్దీన్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 30 గేట్లను 1 అడుగు వంతున ఎత్తి దిగువకు 21 వేల 900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 17వేల 644 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జెఈ తెలిపారు.



బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు వినతిపత్రం అందిస్తున్న ఏపీ రజక వృత్తిదారుల సంఘం నాయకులు

రజకుల ఆర్థికాభ్యున్నతికి కృషి చేయండి

- సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య

తాడేపల్లి, ఆగస్టు 21: ప్రభుత్వం ఏర్పాటు చేసిన రజక అభివృద్ది సంక్షేమ కార్పొరేషన్‌కు విధివిధానాలు రూపొందించి బడ్జెట్ ద్వారా నిధులు కేటాయించి ఆ నిధులను రజకుల ఆర్థిక అభ్యున్నతికి వినియోగించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య విజ్ఞప్తి చేశారు. మండలంలోని కొలనకొండలో బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి సవితను కలిసి రజక వృత్తిదారుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఇస్త్రీ చేస్తున్న రజక వృత్తిదారులకు ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 200 యూనిట్లు ఉచిత కరెంటు వెంటనే మంజూరు చేయాలని, అలాగే పట్టణ కేంద్రాల్లో వృత్తిదారులకు అధునాతనమైన యంత్రాలతో మోడ్రన్ ధోబి ఘాట్‌లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి, వాటి అమలుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం రాష్ట్ర కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటి సభ్యులు బొజ్జ సుబ్బారావు, దావులూరి శ్రీనివాసరావు, నూతక్కి నాగేశ్వరరావు, మొర్తోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అక్షయపాత్ర ఫౌండేషన్ నిర్వహణ భేష్



అక్షయ పాత్రను పరిశీలిస్తున్న కలెక్టరు నాగలక్ష్మీ

- ఫౌండేషన్‌లో పంపిణీ మానిటరింగ్ మెకానిజం బాగుంది
- గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి

మంగళగిరి సిటీ, ఆగస్టు 21: అక్షయపాత్ర ఫౌండేషన్ వారి వంట తయారీ విధానం చాలా బాగుందని గుంటూరుజిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు. మంగళగిరి మండలం ఆత్మకూరు వద్ద వున్న అక్షయపాత్ర ఫౌండేషన్‌ను కలెక్టరు ఎస్.నాగలక్ష్మీ బుధవారం సందర్శించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అన్న క్యాంటీన్లకు సరఫరా చేస్తున్న భోజనం తయారీ ఆధునిక పరికరాలను ఆమె పరిశీలించారు. భోజనం హైజెనిక్‌గా ఆహార పదార్థాలను తయారు చేసే విధానాన్ని ఆపరేషన్స్ మేనేజరు శ్రీహరి కలెక్టరు నాగలక్ష్మికి వివరించారు. అనంతరం కలెక్టరు విలేకరులతో మాట్లాడుతూ అక్షయపాత్ర ఫౌండేషన్‌ద్వారా తెనాలి, దుగ్గిరాల, మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు మండలాల్లోని 311 పాఠశాలలకు మధ్యాహ్న భోజనాన్ని అందించడంతో పాటు ఈ నెల 16వ తేదీ నుంచి అన్న క్యాంటిన్లకు కూడా ఇక్కడినుంచి ఆహారం సరఫరా చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఒక లక్ష మందికి భోజనం తయారు చేయడానికి అవసరమైన అత్యాధునిక వంట సామగ్రి ఇక్కడ అందుబాటులో వుందన్నారు. తయారైన ఆహార పదార్థాలను సకాలంలో జాబితా ప్రకారం అన్ని ప్రాంతాలకు పంపిణీ చేసేందుకు మానిటరింగ్ మెకానిజం బాగా పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టరు పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఎంటీఎంసీ కమిషనరు అలీమ్ బాషా, డీఎస్వో కోమలి పద్మ, మార్కెటింగ్ ఏడీ రాజాబాబు, మంగళగిరి తహసీల్దారు సుభానీ అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నాటి దుర్ఘటన జరిగి నేటికి 25 ఏళ్లు..

- గోలివాగులో 10 మంది జల సమాధి



ఉధృతంగా ప్రవహిస్తున్న గోలి వాగు (ఫైల్)

రెంటచింతల,ఆగస్టు 21 : సరిగ్గా పాతికేళ్ల క్రితం ఇదే రోజు.. భారీ వర్షాలు కురుస్తున్నాయి. గృహాలోంచి బయటకు వచ్చే పరిస్థితి లేదు. గోలి వాగు మహోధృతంగా ప్రవహిస్తుంది. లోలెవెల్ చపా మీద నుంచి వాహనాలు వెళ్లడం అంతంత మాత్రమే. అయితే ఒకటి రెండు లారీలు వాగు దాటి ఆవలి ఒడ్డుకు చేరాయి. మాచర్లలో వివాహానికి హాజరయ్యేందుకు 10 మంది సుమో వాహనంలో గురజాలలో బయలుదేరి గోలి వాగు దగ్గరకు వచ్చారు. వాగు దాటే పరిస్థితి లేదు. అందులో ఓ పెద్దాయన ముందు వెళ్లిన లారీ వాళ్లను అడిగి మోకులు(తాళ్లు) తీసుకోండి.. సుమోకు కట్టి వెళ్దాం.. పెళ్లికి టైమౌతోందని ఉచిత సలహా ఇచ్చాడు.. డ్రైవర్ మణి మోకులు తెచ్చి సుమోకి కట్టి వాగు మీద నుంచి లాగిస్తున్నారు. కొంత దూరం వెళ్లగానే తాళ్లు తెగిపోయాయి. సుమో నీళ్లలో కొట్టుకుపోయింది. 10 మంది మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటనకు నేటికి 25 ఏళ్లు (2000 ఆగస్టు 22).



సత్తెమ్మ అమ్మవారు, దుండగులు పగల గొట్టిన హుండీ

అటవీ ప్రాంతంలోని ఆలయంలో చోరీ

- నాలుగు హుండీలలో నగదు, ఆభరణాలు అపహరణ

అచ్చంపేట, ఆగస్టు 21 : మండలంలోని మాదిపాడు అటవీ ప్రాంతంలో వేంచేసి ఉన్న సత్తెమ్మ అమ్మవారి నాలుగు హుండీలు, అమ్మవారి మెడలోని బంగారు నగలను దొంగలు దోచుకు వెళ్లిన ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు దేవస్థానంలోకి ప్రవేశించి, ముందుగా అక్కడి సీసీ కెమేరాలను ధ్వంసం చేశారు. ఆలయ ప్రాంగణంలోని నాలుగు హుండీలను, అమ్మవారి మెడలో విలువైన మంగళసూత్రాలతో పాటు తలపైవున్న వెండి కిరీటాలు, పలు ఆభరణాలు దోచుకెళ్లారు. సమీప ఎర్రవాగు ప్రాంతంలో హుండీలు పగల గొట్టి నగదును కొల్లగొట్టారు. బుధవారం యధావిధిగా ఆలయ పూజారి, సిబ్బంది పూజారి దేవస్థానం వద్దకువచ్చి తలుపులు తెరవగానే హుండీలు, అమ్మవారి మెడలోని మంగళసూత్రాలు లేక పోవటంతో స్థానిక ఏఎస్ఐకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ఆలయ పరిసర ప్రాంతాల్లో తనిఖీ చేసి హుండీలను స్వాధీనం చేసున్నారు. ఆలయంలో ఇలాంటి ఘటన జరగటం ఇదే మొదటిసారి. ఆలయంలో చోరీకి గురైన సొత్తు మొత్తం సుమారు రూ.10 లక్షలకు పైగా ఉంటుందని భక్తులు తెలిపారు. దేవస్థానం వద్ద రాత్రి వాచ్‌మెన్ లేకపోవటంతోనే ఈ చోరీ జరిగిందని, ఇందుకు ఆలయ అధికారుల నిర్లక్ష్యమే కారణమని భక్తులు మాట్లాడుకుంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కేంద్రీయ విద్యాలయంలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

సెప్టెంబరులో కేంద్రీయ విద్యాలయం ప్రారంభం

- చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, ఆగస్టు 21 : ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయ శాశ్వత భవనాలను సెప్టెంబరులో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని ఇర్లపాడు గ్రామపరిధిలో నిర్మాణంలో వున్న కేంద్రీయ విద్యాలయ భవననిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం పుల్లారావు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వలనే నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయన్నారు. కేంద్రీయ విద్యాలయాలు ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యార్థులకు బోధనను అందిస్తున్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గణపవరంలో తాత్కాలిక భవనాల్లో తరగతులను ప్రారంభించామన్నారు. నర్సరీ నుంచి ఇంటర్ వరకు విద్యా బోధన జరిగే ఈ విద్యాలయంలో 49 తరగతి గదులను నిర్మించారన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల కన్నా విద్యాబోధనలో కేంద్రీయ విద్యాలయం మొదటిస్థానంలో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ఫణీంద్ర, టీడీపీ నేతలు సత్యనారాయణ, గంగా శ్రీనివాసరావు, హనుమంతరావు, నాగేశ్వరరావు, జయ ప్రసాదు, నాగ పూర్ణచంద్రరావు, సురేష్, ఉపేంద్ర, సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

గురజాల అదనపు జిల్లా కోర్టు ఏపీపీ తొలగింపు

గుంటూరు(లీగల్), ఆగస్టు 21: గురజాల అదనపు జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న బారెడ్డి నాగిరెడ్డిని ఆ పదవి నుంచి తొలగిస్తూ రాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పలు కేసుల్లో నాగిరెడ్డి ఉద్దేశపూర్వకంగా కోర్టులో దాఖలైన కొన్ని పిటీషన్‌ల గురించి పోలీసులకు సమాచారం అందించలేదని, కోర్టుకు నిజాలు చెప్పకుండా దాచి నిందితులు కోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందేందుకు సహకరించాడని, ఇందుకుగాను నాగిరెడ్డిని ఆ పదవి నుంచి తొలగించి మరొకరిని నియమించాలని కోరుతూ పల్నాడు జిల్లా ఎస్పీ జూన్ 18న ప్రాసిక్యూషన్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. దీనిపై దర్యాప్తు జరిపిన ప్రాసిక్యూషన్ విభాగం పల్నాడు జిల్లా ఎస్పీ చేసిన ఆరోపణలలో వాస్తవం ఉందని తేల్చింది. నాగిరెడ్డి ప్రాసిక్యూషన్ వ్యవస్థ పరువు ప్రతిష్టలకు భంగం వాటిల్లే విధంగా ప్రవర్తించాడని, తన వ్యవహార శైలితో ప్రాసిక్యూషన్ వ్యవస్థనే ఇబ్బందికరమైన పరిస్థితుల్లోకి తీసుకు వెళ్లాడని, అతన్ని విధుల్లో కొనసాగిస్తే వ్యవస్థనే సవాల్‌చేసే పరిస్థితి ఉత్పన్నం కావచ్చని పేర్కొంటూ రాష్ట్ర హోంశాఖ ప్రధాన కార్యదర్శికి ప్రాసిక్యూషన్ డైరెక్టర్ జూలై 4న నివేదిక ఇచ్చారు. దీంతో నాగిరెడ్డిని ఏపీపీ పదవి నుండి తొలగిస్తూ రాష్ట్ర హోం శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌ల ధ్వంసం కేసులతో పాటు పలు కేసుల్లో నాగిరెడ్డి వైసీపీ వర్గీయులకు కొమ్ముకాస్తూ నిందితులుగా ఉన్న వారిని కేసుల నుంచి బెయిల్ పొందేందుకు తన వంతు సహకారం అందించాడని అతనిపై పలు ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ హయాంలో నియమితులై ఆ పార్టీ వారికి కొమ్ము కాస్తూ కోర్టుల్లో వ్యవహరిస్తున్న మరికొంతమంది టెన్యూర్ ఏపీపీలతో పాటు రెగ్యులర్ ఏపీపీల వ్యవహార శైలిపై కూడా పోలీసు శాఖతో పాటు రాష్ట్ర ప్రాసిక్యూషన్స్ కార్యాలయం దృష్టిసారించినట్లు తెలిసింది.

52,234 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 53,961 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 52,234 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 24,572 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7000	17500	334	8500	17000
నెంబరు. 5	9000	13000	నెంబరు. 5	9000	13000
273	9000	12500	273	–	–
341	8000	16500	341	8500	17000
4884	10500	11000	4884	9500	16500
సూపర్ 10	--	--	సూపర్ 10	10000	11500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18800	తేజ	8000	18500
బ్యాడిగి	8000	17000	బ్యాడిగి	9000	13500
దేవనూరు డీలక్స్	8700	13500	దేవనూరు డీలక్స్	9000	13000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

అన్న క్యాంటీన్‌కు రూ.25 వేల విరాళం

● కమిషనర్ పులి శ్రీనివాసులు అందజేసిన రేట్ పేయర్స్ నాయకులు



కమిషనర్ పులి శ్రీనివాసులుకు చెక్కు అందజేస్తున్న రేటు పేయర్స్ అసోసియేషన్ నాయకులు

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 21: పేదవాడి ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన అన్న క్యాంటీన్లకు గుంటూరు నగర రేట్ పేయర్స్ అసోసియేషన్ విరాళం అందించడం అభినందనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం కమిషనర్ చాంబర్‌లో రేట్ పేయర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కమిషనర్‌కు రూ.25 వేల విరాళం చెక్కుని అం దించారు. రేట్ పేయర్స్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు నారాయణరెడ్డి పేదల కోసం ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు నగర రేట్ పేయర్స్ అసోసియేషన్ ఈసీ మెంబర్ సదాశివరావు, ట్రెజరర్ సాయిరాం, సభ్యులు కృష్ణారావు పాల్గొన్నారు.

ఆహారం అందలేదని ఫిర్యాదు రాకూడదు

అన్న క్యాంటీన్లకు వచ్చిన వారికి ఆహారం అందలేదని ఫిర్యాదులు రాకుండా, ఎప్పటికప్పుడు డిమాండ్‌కు తగిన విధంగా సరఫరా జరిగేలా అక్షయపాత్ర సిబ్బం ది అందించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం చుట్టుగుంట సెంటర్‌లోని అన్నక్యాంటీన్‌ని పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. చుట్టుగుంట క్యాంటీన్‌లోకి వెళ్లడానికి ముందు ఉన్న డ్రైన్‌కి ఇరువైపులా బోర్డులు ఏర్పాటు చేయాలని ఈఈని ఆదేశించారు.

డోర్ టూ డోర్ సర్వేను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి : కమిషనర్

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 21 : స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 ఓటర్ల జాబితాకి సంబంధించి డోర్ టూ డోర్ సర్వేను బీఎల్‌వోలు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బీఎల్‌వోలకు స్పష్టం చేశారు. ఇంటింటి ఓటర్ సర్వే వేగవంతంపై బుధవారం స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సూపర్‌వైజరి అధికారులు, బీఎల్‌వోలతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నగరంలో స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 ఓటర్ల జాబితాకి సంబంధించి డోర్ టూ డోర్ సర్వేలో వేగం పెరగాలని, బీఎల్‌వోలు ప్రతి ఇంటికి వెళ్లి ఓట్ల సర్వే చేయాలన్నారు. బీఎల్‌వోలకు యాప్, లేదా ఫారాల దరఖాస్తుపై ఎటువంటి అనుమానాలు, సందేహాలు వచ్చినా సంప్రదించడానికి ఎన్నికల విభాగంలో సిబ్బందిని కేటాయించుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, డి.వెంకటలక్ష్మి, మేనేజర్ ప్రసాద్, ఎన్నికల సూపరిండెంట్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పన

చౌడవరం రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో మౌలిక వసతులను కల్పించడానికి చర్యలు చేపట్టాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ చౌడవరంలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ చౌడవరం రాజీవ్ గృహకల్పలో నివసించే ప్రజలకు నగరపాలక సంస్థ నుంచి మౌలిక వసతులు కల్పించాలన్నారు. అపార్టుమెంట్‌పైన ఉన్న నీటి ట్యాంకులు, వాటిలో ప్రస్తుతం వినియోగంలో ఉన్నవి, లేనివి, నూతనంగా అవసరమైన వాటి వివరాలతో గురువారానికి నివేదిక ఇవ్వాలని ఏఈని ఆదేశించారు. గృహకల్ప నివాసాలకు ఆస్తి పన్ను వేయడానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారిని ఆదేశించారు. పర్యటనలో ఈఈ కొండారెడ్డి, ఏఈ రవికిరణ్, శానిటరీ ఇనెస్పెక్టర్ సుబ్బారావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో కేఎల్‌పీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), ఆగస్టు 21: జాతీయ స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో కేఎల్‌పీ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారని పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో ఇన్‌టాక్ నేషనల్ హెరిటేజ్ క్విజ్ పోటీల్లో మొత్తం 15 పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. భారతదేశ వారసత్వం, సంస్కృతి, సంప్రదాయాలు, అనే అంశంపై రాత పరీక్ష క్విజ్ పోటీలు నిర్వహించారని తెలిపారు. పోటీల్లో తమ విద్యార్థులు పి.రిషిస్వాతిక, జె.స్వాతిక్‌వర్మ, ప్రశంసాపత్రాలు, నగదు బహుమతి సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల అధ్య క్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ జి రత్తయ్య ఏవో వెంకటరావు అభినందించారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలి

● చీఫ్ సెక్రెటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్



సీఎస్ నిర్వహించిన వీసీకి హాజరైన కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనులపై ఆగస్టు 23వ తేదీన అన్ని గ్రామాల్లో గ్రామ సభలను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ కలెక్టర్ ఎస్ నాగలక్ష్మిని ఆదేశించారు. బుధవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన గ్రామ సభల నిర్వహణ, ఉచిత ఇసుక విధానం అమలుపై కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై గ్రామసభలో ప్రజలతో చర్చించి ఆమోదం తీసుకోవాలన్నారు. గ్రామసభల నిర్వహణపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని, గ్రామాల్లో విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలన్నారు. గ్రామస్తులందరిని సభల్లో భాగస్వాములను చేసి సభను అర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి అధికారుల నుంచి, మండల, గ్రామ స్థాయిలో ఉన్న అధికారుల వరకు ప్రతిఒక్కరు సమన్వయంతో గ్రామసభలు నిర్వహించాలన్నారు. ఉచిత ఇసుక విధానంను పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. స్టాక్ యార్డుల వద్ద వాహనాల క్యూలు లేకుండా ఇసుక బుకింగ్ సమయంలోనే టైం స్లాట్‌ను వాహనదారులకు కేటాయించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ తాళ్ళయపాలెం, లింగాయపాలెం స్టాక్‌యార్డులు కరకట్ట సమీపంలో ఉండటంతో ఇటీవల కృష్ణానదిలో నీటి ప్రవాహంతో లోడింగ్‌కు వచ్చిన వాహనాలు స్పీడ్ యాక్సిస్ రోడ్డుపై నిలిపారన్నారు. టైం స్లాట్ బుకింగ్ ద్వారా వాహనాలు క్యూ లేకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్ బాషా, జిల్లా ప్రజా పరిషత్ సీఈవో వసంతరాయుడు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి, డ్వామా పీడీ ఉమాదేవి, మైనింగ్ ఏడీ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

డివిజన్ సర్వే సర్టిఫికెట్ల జారీకి ప్రత్యేక చర్యలు

● జీఎంసీలో పలు శాఖల అధికారులతో సమావేశం



కమిషనర్‌తో భేటీ అయిన జేసీ భార్గవ్ తేజ్, జిల్లా రిజిస్ట్రార్ శైలజ, ఇతర అధికారులు

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 21: సబ్ డివిజన్ సర్వే సర్టిఫికెట్ల జారీకి ప్రత్యే క చర్యలు నగరంలో ఖాళీ స్థలాలకు సంబంధించిన సర్వే సబ్ డివిజన్ సర్టిఫికెట్ల సమస్య శాశ్వత పరిష్కారం కోసం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ్, జిల్లా రిజిస్ట్రార్ డి.శైలజ, ఏడీ సర్వే వై.నాగేశ్వర్, నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్‌తో కలసి బుధవారం సాయంత్రం కమిషనర్ ఛాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నగర పాలకసంస్థ, విలీన గ్రామాల్లో కొంతకాలంగా ఖాళీ స్థలాలకు సంబంధించిన సబ్ డివిజన్ సర్టిఫికెట్ల మంజూరు విషయంలో నగర ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యల శాశ్వత పరిష్కారం కోసం క్షుణ్ణంగా సమీక్షించి చర్యలు తీసుకున్నారు. ఇకపై నగరపాలక సంస్థ పరిధిలో 10 విలీన గ్రామాల పరిధి లోని నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌కు సంబంధించిన టీఎస్ నెంబర్ డీ లకు సంబంధించిన ఖాళీ స్థలాలకు నగర పాలక సంస్థ సబ్ డివిజన్ సర్టిఫికెట్లు జారీ చేస్తుందని, రెవెన్యూ విభాగం వారు గుంటూరు నగరంలో, విలీన గ్రామాల్లోని డీ నెంబర్ కలిగిన వ్యవసాయ భూములకు మాత్రం సబ్‌డివిజన్ సర్టిఫికెట్లు జారీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఖాళీ స్థలాల సర్వే కోసం వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శుల ద్వారా తనిఖీలు నిర్వహించి టౌన్ సర్వేయర్ అప్రూవల్‌తో పట్టణ ప్రణాళిక అధికారులు సర్టిఫికెట్లు జారీ చేస్తారన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్ని కలెక్టర్ వారి ఆమోదం అనంతరం సర్టిఫికెట్ల జారీ అమల్లోకి వస్తుందన్నారు. సమావేశంలో ఏసీపీ అజయ్‌కుమార్, టీపీఎస్ రసూల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి

అర్హత ఉన్న ప్రతి వారికి వితంతు పెన్షన్ అందాలి

● న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి

గుంటూరు (లీగల్), ఆగస్టు 21 : నిర్దేశిత ధ్రువపత్రాలు కలిగిన ప్రతి ఒక్కరికీ వితంతు పింఛన్ అందుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి తెలిపారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం నగరంలో వితంతు పెన్షన్‌లు మంజూరు కాని అర్జీదారులతో, అధికారులతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన శిబిరం జరిగింది. ఈ శిబిరంలో లీలావతి మాట్లాడుతూ గుంటూరులో సుమారు 600 మంది వితంతు పెన్షన్ మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారు తమ భర్త మరణ ధ్రువీకరణ పత్రం కూడా దరఖాస్తుకు జత చేయాలన్నారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ వితంతు పెన్షన్ మంజూరుకు తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డి.వెంకటలక్ష్మి, న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు, జీఎంసీ ఉపా సెల్ పీవో వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో బంద్ ప్రశాంతం

● మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు

● మధ్యాహ్నం వరకు ఆర్టీసీ సర్వీసులు ఎక్కడివక్కడే



నిరసన ప్రదర్శనలో ప్రసంగిస్తున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ తదితరులు

గుంటూరు, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ భారత్ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో మాలమహానాడు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసన ర్యాలీలు, రాస్తారోకోలు చేశారు. జిల్లాలో ఆర్టీసీ సర్వీసులు మధ్యాహ్నం 12 గంటల వరకు డిపోలకే పరిమితమయ్యాయి. పలు విద్యా సంస్థలకు ముందే సెలవులు ప్రకటించారు. ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు కొనసాగగా పలు దుకాణాలు పాక్షికంగా మూతపడ్డాయి. మొత్తానికి జిల్లాలో బంద్ ప్రశాంతంగా జరిగింది. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్, జిల్లా అధ్యక్షుడు దారా హేమప్రసాద్ పలువురు నాయ కులు, ఇతర మాల సంఘాల నాయకులు గుంటూరులో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేశారు. వాహనాల రాకపోకలు నిలిపివేస్తూ రోడ్డుపై బైఠాయించి కొద్దిసేపు రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. అనంతరం బ్రాడీపేట శంకర్‌విలాస్ సెంటర్ మీదుగా హిందూ కళాశాల సెంటర్, ఎన్‌టీఆర్ బస్టాండ్, నల్లచెరువు, రింగ్ రోడ్డు, బృందావన్‌గార్డెన్స్, గుజ్జనగుండ్ల వంటి ప్రధాన రహదారుల్లో నిరసన ప్రదర్శన చేశారు. కలెక్టరేట్ మెయిన్‌గేటు వద్ద కొద్దిసేపు నిరసన తెలిపారు.

మధ్యాహ్నం వరకు బస్సులన్నీ డిపోల్లోనే..

బంద్ నేపథ్యంలో జిల్లాలో ఆర్టీసీపై ప్రభావం చూపింది. నిరసనకారుల ఆందోళనతో ముందుగానే అప్రమత్తమైన ఆర్టీసీ యంత్రాంగం ఉదయం మొదటి ట్రిప్పుల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బస్సులను నిలిపివేశారు. గుంటూరు-1, 2 డిపోలతో పాటు పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోల్లో ఎక్కడివక్కడ బస్సులు నిలిచిపోయాయి. దాంతో ప్రయాణికులు మధ్యాహ్నం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఫలితంగా ఆర్టీసీకి రూ.లక్షల్లోనే నష్టం వచ్చినట్లు అధికారులు తెలిపారు. బంద్ సందర్భంగా పలు పాఠశాలల యాజమాన్యాలు ముందుగానే సెలవు ప్రకటించారు. కొన్ని పాఠశాలల్లో ఉదయం వరకు క్లాసులు నిర్వహించినా నిరసనకారుల పిలుపుతో మధ్యాహ్నం నుంచి విద్యార్థులకు సెలవు ప్రకటించి పంపించి వేశారు.

జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినాకు పెన్షనర్ల సన్మానం

గుంటూరు సిటీ, ఆగస్టు 21: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యాజ్యోతి పథకాన్ని అమలు చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమె క్యాంపు కార్యాలయంలో బుధవారం సన్మానించారు. జడ్పీ పాఠశాలల్లో రాత్రి కాపాలాదారులను ఏర్పాటు చేయటం గొప్ప విషయమని అసోసియేషన్ సభ్యులు అన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ అసోసియేషన్ కార్యదర్శి పి.నాగరాజు, ఎం నరసింహమూర్తి (ఐసీడీ ఎస్), శ్రీనివాసరావు (జిల్లా పరిషత్), రాంబాబు, ఎంఎస్ నాగేంద్ర, జి.రామకృష్ణ (ఎస్టీవో) పాల్గొన్నారు.

నేటి నుంచి ఏటీ అగ్రహారంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, ఆగస్టు 21: చుట్టుగుంట పోలేరమ్మ తల్లి దేవస్థానం నుంచి అంకమ్మనగర్ ఆర్‌యూబీ వరకు ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు ఏటీ అగ్రహారం, అంకమ్మనగర్, శాంతి నగర్, ఆకులవారితోట ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్-3 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.రాజమోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

అనారోగ్య సమస్యలతో వృద్ధుడు ఆత్మహత్య

గుంటూరు, ఆగస్టు 21 : లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంత్రివారివీధికి చెందిన పూల గురవయ్య (78) అనారోగ్య సమస్యలతో ఈనెల 21న అత్యధిక మోతాదులో మందు బిళ్ళలు మింగాడు. దీంతో కుమారుడు శ్రీనివాస్ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు లాలాపేట సీఐ శివప్రసాద్ కేసుదర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వాల ఉదాసీనతతో మహిళలపై దాడులు

● బ్యాంకుల ఉద్యోగుల యూనియన్ సలహాదారు కిషోర్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 21 : ప్రభుత్వాల ఉదాసీనతతోనే మహిళలపై దాడులు పెరుగుతున్నాయని బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ యూనియన్ ముఖ్య సలహాదారు కిషోర్ ఉన్నారు. కలకత్తాలో యువ ట్రెయినీ డాక్టర్ హత్యను ఖండిస్తూ లాడ్జి సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ ప్రోద్బలంతోనే ఇలాంటి ఘటనలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని చెప్పారు. బ్యాంక్ మహిళా విభాగం నాయకురాలు పావని మాట్లాడుతూ న్యాయవిచారణ త్వరగా జరపకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమానికి ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. కొరిటెపాడు నుంచి లాడ్జి సెంటరు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బాషా, రవి చంద్రారెడ్డి, మురళి, షరీఫ్, పృథ్వీ, నాగేందర్, రామకృష్ణ, వేణు, శివ, క్రాంతి, అఖిల పాల్గొన్నారు.

పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు పటిష్ట భద్రత కల్పించాలి

● మచిలీపట్నం ఎల్‌ఐసీ డివిజన్ కన్వీనర్ సీహెచ్ మధుబాల

గుంటూరు(తూర్పు), ఆగస్టు 21: పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు పటిష్ఠ భద్రత కల్పించాలని మహిళా ఉద్యోగుల సమన్వయ కమిటీ, మచిలీపట్నం ఎల్‌ఐసీ డివి జన్ కన్వీనర్ సీహెచ్ మధుబాల అన్నారు. బుధవారం వివిధ రంగాల్లో పని చేస్తున్న మహిళలపై దాడులను ఖండిస్తూ స్థానిక అమరావతి రోడ్డులోని ఎల్ఐసీ కార్యాల యం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణకు తీసుకొచ్చిన చట్టాల అమలు తీరు అత్యంత ఘోరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో భద్రతపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాలన్నారు. కోల్‌కత్తా వైద్యురాలిపై జరిగిన హత్య నిందితులను కఠినంగా శిక్షిం చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీసభ్యులు వాణీకుమారి, టి.అనసూ యారాణి, వి.భార్గవి, జి.కామేశ్వరి, డి.సుమ, డి.సైదులు, ఐ వెంకట్రావు పాల్గొన్నారు.

28న భగవాన్ ధన్వంతరి విగ్రహ ప్రతిష్ఠ

గుంటూరు (మెడికల్) ఆగస్టు 21: మహాత్మాగాంధీ ఇన్నర్‌రింగ్ రోడ్ భాష్యం రామసేతు క్యాంపస్ వెనుక గల వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో ఈనెల 28న భగవాన్ ధన్వంతరి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని ఆయుర్వేద వైద్యనిపుణులు కొండా వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8.11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు హాజరవుతారని ఆయన వివరించారు. గౌరవ అతిథులుగా ఎమ్మెల్యేలు ఎండీ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, సౌత్ కోస్టల్ జోన్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా దీక్షా హోమం, మహాపూర్ణాహుతి, అన్న ప్రసాద వితరణ జరుగుతాయని డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు.

కోనో కార్పస్ మొక్కలను రక్షించండి

● సీఎం చంద్రబాబుకి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి విజ్ఞప్తి



సీఎం చంద్రబాబునాయుడుకు అభినందనలు తెలుపుతున్న లక్ష్మణరెడ్డి

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 21 : ఆంధ్రప్రదేశ్‌లో 15 సంవత్సరాలు గా కోనో కార్పస్ (దుబాయ్) మొక్కలు దాదాపు 40 లక్షలకు పైగా అభివృ ద్ధి చెంది ఉన్నాయని, ఈ మొక్కలను రక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం చంద్రబాబును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ బహుళ ప్రయోజ నాలు గల కోనోకార్పస్ చెట్లపై విషప్రచారంతో, అభూత కల్పనలతో రాష్ట్ర వ్యాప్తంగా వాల్టా చట్టాన్ని అనుసరించకుండా ఆ చెట్లను నరికి వేస్తు న్నారని తెలిపారు. ఇలాంటి విధ్వంసాన్ని వెంటనే ఆపాలని కోరారు.

పాత గుంటూరులో రెండు గ్రూపుల మధ్య ఫ్లెక్సీల గొడవ

గుంటూరు (కార్పొరేషన్), ఆగస్టు 21 : పాతగుంటూరులో రెండు గ్రూపుల మధ్య ఫ్లెక్సీల రగడ బుధవారం రాత్రి జరిగింది. చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని పాతగుంటూరులోని ఆంజనేయస్వామి గుడి సెంటరులో ఒక వ్యక్తి ఫ్లెక్సీలు కట్టుకోగా మరో గ్రూపునకు చెందిన వారు వచ్చి దౌర్జన్యంగా ఆ ఫ్లెక్సీపై మరో ఫ్లెక్సీ కట్టారు. దీంతో రెండు గ్రూపుల మధ్య ఘర్షణ మొదలైంది. సమాచారం అందుకున్న పోలీసులు రెండు గ్రూపులను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

బ్రాడీపేటలో చోరీ

గుంటూరు, ఆగస్టు 21 : స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రాడీపేట 6/14లోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈవెంట్స్ ఆర్గనైజర్ మునిపల్లి సీతారామచంద్రమూర్తి కుటుంబంతో ఈనెల 18న అరుణాచలం వెళ్లి బుధవారం ఊరి నుంచి తిరిగి రాగా ఇంటిలోనే బీరువా పగలగొట్టి అందులో ఉంచిన సుమారు 5 సవర్ల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టాభిపురం సీఐ కిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది.

సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నసీర్

గుంటూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి ఒక తాటిపై నడుస్తున్నాయని ఎమ్మెల్యే ఎండీ నసీర్ అన్నారు. శారదాకాలనీ 21వ లైన్‌లో 25 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్లకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుంటూరు తూర్పులో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుందని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో గుంటూరు నగరం అభివృద్ధికి నోచుకోలేదని అధికార దాహంతో వైసీపీ నేతలు దోపిడీ లక్ష్యంగా పనిచేశారని విమర్శించారు. గత ఎమ్మెల్యే ముస్తఫా కుటుంబం నియోజకవర్గాన్ని దోచుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముప్పవరపు భారతి, మాజీ కార్పొరేటర్ గోళ్ళ ప్రభాకర్, వార్డ్ అధ్యక్షుడు గుడిమెట్ల దయారత్నం, మహంకాళి నరసింహారావు, పఠాన్ బాజీ, బాబూరావు, ఆనంద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయం మరువలేనిది

● కేజేఎస్ఎస్ అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు



సామినేని కోటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న దాతలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 21: జేకేసీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయానికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని కమ్మ జనసేవ సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అన్నారు. నూతన భవన సముదాయంలో ఒక గది నిర్మాణానికయ్యే ఖర్చు రూ.6 లక్షల విరాళాన్ని తెనాలి నియోజకవర్గం పెదపూడి గ్రామానికి చెందిన వేములపల్లి పావెల్, వేములపల్లి అల్యూష్‌లు బుధవారం బృందావన్‌గార్డెన్స్ బాలికల వసతి గృహంలో ఆయనకు అందజేశారు. అనంతరం సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ దాతల సహకారంతో నూతన భవన నిర్మాణం మొదలైందని త్వరలోనే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. భవన నిర్మాణానికి దాతలు మరింతగా ముందుకు రావాలని కోరారు. దాతలు మాట్లాడుతూ వేములపల్లి బుల్లెమ్మ, నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందజేసినట్టు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, పాలకవర్గ సభ్యులు కన్నెగంటి బుచ్చయ్య చౌదరి, గోరంట్ల పున్నయ్య చౌదరి, గుంటుపల్లి కోటేశ్వరరావు, ఘంటా పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

విపత్తులను అధిగమించే నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

గుంటూరు(విద్య), ఆగస్టు 21: యువత విపత్తులను అధిగమించే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్విరాన్‌మెంట్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ పి.బ్రహ్మాజీరావు అన్నారు. చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. విపత్తు పరిణామాల నివారణకు తీసుకోవాల్సి చర్యలపై కనీస అవగాహన ఉండాలని సూచించారు. వాతావరణంలో సంభవించే మార్పుల వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని వాటిపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, కళాశాల ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, జగదీష్ కె.మద్దినేని, ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ నార్నె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రహ్మాజీరావు

పెన్షనర్లు, వేతన జీవులకు వెతలు

గుంటూరు, ఆగస్టు 21: వేతన సవరణ సంఘం సిఫార్సులు అమల్లోను కమి షన్ రిపోర్టు ఇవ్వటంలోను ప్రతిసారి జాప్యం జరగటంతో పెన్షనర్లు, వేతన జీవుల ను నిరీక్షణకు గురిచేస్తుందని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో విమర్శించారు. వేతన సవరణ సంఘం ఏర్పాటు తరువా త సిఫార్సుల అమలులో ప్రతిసారి తీవ్ర జాప్యం జరుగుతుండటంతో ఉద్యోగులు, పింఛన్‌దారులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. పీఆర్‌సీ అమలు చేసే దాకా 20 శాతం ఐఆర్ వెంటనే చెల్లించాలని, ప్రభుత్వం నియమించిన 12వ పీఆర్‌సీ ఈ ఏడాది జూలై నుంచి అమలు కావాల్సి ఉండగా ఇప్పటికీ కమిటీకి కావాల్సిన సిబ్బందిని నియమించలేదని తెలిపారు. కొత్త పీఆర్‌సీ పని ప్రారంభించి దాని సిఫార్సు ఇచ్చేందుకు కనీసం ఏడాది పడుతుందని ఇంత జాప్యాన్ని భరించే స్థితిలో ఉద్యోగులు, పెన్షన్‌దారులు లేరన్నారు. జిల్లాలో 56 ప్రభుత్వ శాఖల పరిధి లో సుమారు 50వేల మంది ఉద్యోగులు 40వేల మంది పెన్షన్‌దారులు ఉన్నారన్నా రు. ప్రస్తుతం అమలు చేయాల్సిన పీఆర్‌సీ వాస్తవంగా జూలైలోనే అమలు చేయా ల్సి ఉండగా ప్రభుత్వం అసలు కమిటీనే నియమించలేదన్నారు. దీనివల్ల ఉద్యోగు లు పెన్షన్‌దారులు గతంలో కూడా 18నెలల ఆర్థిక ప్రయోజనం కోల్పోయారన్నారు. పెరిగిన ధరల కారణంగా ప్రస్తుతం ఇస్తున్న జీతాలు, పెన్షన్‌లు చాలటం లేదని ఆరోగ్యం కాపాడుకోవటానికే సగం సొమ్ము ఖర్చవుతుందన్నారు. ఆరోగ్యం బాగుం టేనే విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ సరిపోతుందన్నారు. మెడికల్ లీవ్‌లు, ఎన్‌క్యాష్ మెంట్, ప్రసూతి సెలవులు, అప్రెంటీస్ సర్వీసును పింఛన్‌కు అర్హదాయక సర్వీసు గా పరిగణించటం మెడికల్, అంత్యక్రియల అలవెన్స్ పెంపు తదితర ప్రయోజనాల కోసం ఉద్యోగులు ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీకి తగినంత సిబ్బందిని నియమించి కమిషన్ సిఫార్సులను ఆమోదించి కొద్ది నెలల్లోనే పింఛన్‌దారులకు, ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వీరయ్య కోరారు.



తిరుమలలో చిరంజీవి

● కుటుంబ సభ్యులతో కలసి నేడు శ్రీవారి దర్శనం

మెగాస్టార్ చిరంజీవి శ్రీవారి దర్శనార్థం బుధవారం తిరుమలకు చేరుకున్నారు. రాత్రి 8గంటలకు తిరుమలలోని ఫీనిక్స్ అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ అధికారులతో పాటు అభిమానులు స్వాగతం పలికారు. చిరంజీవితో పాటు ఆయన సతీమణి సురేఖ, తల్లి అంజనా దేవి కూడా తిరుమలకు చేరుకున్నారు. అంతకుముందు సాయంత్రం కుమార్తె శ్రీజ కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. గురువారం చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆలయంలో వేకువజామున జరిగే సుప్రభాతసేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకోనున్నారు.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)

బ్లాక్‌బస్టర్ పక్కా



నాని, ప్రియాంక మోహన్ జంటగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం'. ఎస్.జే సూర్య, సాయికుమార్ కీలక పాత్రలు పోషించారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య కల్యాణ్ దాసరి నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు, ట్రైలర్ అందరినీ ఆకట్టుకుని సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఈ నెల 29న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ సినిమా కోసం చిత్రబృందం ఎంతో కష్టపడింది. ఆ కష్టం తెరపై కనపడుతుంది. వారి కోసం ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలి. ఈ సినిమాకు వివేక్ రైటింగ్, జేక్స్ బిజోయ్ సంగీతం స్పెషల్ అట్రాక్షన్. నాకు కోపం వచ్చింది. అలా కోపం వచ్చిందంటే బ్లాక్‌బస్టర్ పక్కా" అని చెప్పారు. "ఈ సినిమాలో ఎస్.జే. సూర్య, నాని పోటాపోటీగా నటించారు. వివేక్ నుంచి ఇటువంటి కమర్షియల్ సినిమా అస్సలు ఊహించలేదు. సినిమాను డైరెక్టర్ ఓ రేంజ్‌లో తీశారు" అని దిల్‌రాజు అన్నారు. "ఈ సినిమాకు కథే బలం. సినిమా అద్భుతంగా వచ్చింది" అని చిత్ర నిర్మాత డి.వి.వి.దానయ్య తెలిపారు.

ముఫాసాకు మహేశ్ వాయిస్



ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకట్టుకున్న 'ది లయన్ కింగ్' చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ వస్తోంది. 'ముఫాసా ది లయన్ కింగ్' పేరుతో వస్తున్న ఈ చిత్రం తెలుగు వెర్షన్‌లో ముఫాసాకు మహేశ్‌బాబు వాయిస్ అందిస్తుండడం ఆసక్తికరం. ఈ సినిమా హిందీ వెర్షన్‌కు షారుఖ్ ఖాన్ డబ్బింగ్ చెప్పారు. తెలుగు వెర్షన్‌లో పుంబా పాత్రకు బ్రహ్మానందం, టిమోన్ పాత్రకు అలీ డబ్బింగ్ చెప్పారు. తెలుగు వెర్షన్ ట్రైలర్‌ను ఈ నెల 26న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ 'డిస్నీతో అనుబంధం నాకు ప్రత్యేకమైంది. తన కొడుకు అంటే అభిమానం కలిగిన పాత్ర ముఫాసా. అంతేకాదు అడవికి రారాజు. ఆ పాత్రకు నేను వాయిస్ అందించడం నా పిల్లలతో ఎంతో ఆనందంగా సెలబ్రేట్ చేసుకునే సందర్భం ఇది' అన్నారు. డిసెంబర్ 24న 'ముఫాసా ది లయన్ కింగ్' విడుదలవుతుంది.



సిద్ధు కోసం శ్రీనిధి

సిద్ధు జొన్నలగడ్డ తాజా చిత్రం 'తెలుసు కదా' చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో కొనసాగుతోంది. స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. ఇందులో రాశీ ఖన్నా శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తుండగా, తాజా షెడ్యూల్‌లో శ్రీనిధి జాయిన్ అయ్యారు. కీలకమైన సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్.

తెలుగులోనూ ఆదరిస్తారు



హారర్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను భయపెట్టిన 'డీమాంటి కాలనీ'కి సీక్వెల్‌గా తెరకెక్కిన తమిళ చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. అజయ్.ఆర్.జ్ఞానముత్తు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను బి.సురేశ్ రెడ్డి, బి.మానస రెడ్డి నిర్మించారు. అరుల్‌నిధి, ప్రియా భవానీశంకర్ ముఖ్య పాత్రల్లో నటించారు. సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథి రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ "మంచి కంటెంట్ ఉన్న ఇలాంటి సినిమాను తెలుగులోను ఆదరిస్తారు" అని చెప్పారు. "ఈ సినిమాకు కొనసాగింపుగా మరో రెండు భాగాలు ఉంటాయి" అని దర్శకుడు అజయ్.ఆర్.జ్ఞానముత్తు అన్నారు.

అద్భుతమైన కంటెంట్‌తో 'రేవు'



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వంలో డా.మురళి గింజుపల్లి, నవీన్ పారుపల్లి నిర్మించారు. సీనియర్ జర్నలిస్టులు ప్రభు దర్శకత్వ పర్యవేక్షణ చేపట్టగా, పి.రాంబాబు ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు హరినాథ్ మాట్లాడుతూ "ఈ సినిమా కంటెంట్ అద్భుతంగా ఉంటుంది. అందరూ మెచ్చే చిత్రమిది" అని అన్నారు. "ఈ సినిమాను థియేటర్‌లో చూసి ఎగ్జైట్ అవుతారు" అని నిర్మాత డా.మురళి గింజుపల్లి అన్నారు.

SCHOLARSHIP ALERT

Reliance Foundation Undergraduate

Description: The Reliance Foundation Under graduate Scholarships aim to support meritorious students from all corners of the country in pursuing their undergraduate education. This empowers them to continue their studies, be come successful professionals, and realize their dreams, unlocking their potential to uplift themselves and their communities and contribute towards India's future socio-economic development.

Eligibility: Students must be enrolled in the first year of a full-time regular undergraduate (UG) de gree in any stream at a recognised Indian institute. ● Must have passed Class 12 with a minimum of 60% marks. ● The annual household income should be up to INR 15,00,000 per year (preference will be given to those students whose family income is less than INR 2,50,000)

● Open for resident Indian citizens only. An aptitude test is mandatory.

Prizes & Rewards: Up to INR 2,00,000 over the duration of the degree

Last Date to Apply: 06-10-2024

Application mode: Online only

Short Url: ww.b4s.in/aj/RFS11

SBIF Asha

దిక్సూచి

Description: The SBIF Asha Scholarship Program 2024, one of India's largest scholarship programs, is an initiative of the SBI Foundation. This scholarship aims to provide financial assistance to meritorious students from low-income families across India, ensuring the continuity of their education.

Eligibility: Open to school students from Class 6 to 12 and undergraduate & postgraduate students from the top 100 NIRF universities/colleges, undergraduate students from IITs, and students pursuing MBA/PGDM courses from IIMs. Applicants must have scored a minimum of 75% marks in the previous academic year. Their gross annual family income must be up to INR 6 lakh (Up to INR 3 lakh for Class 6-12 students).

Prizes & Rewards: **Classes 6 to 12:** INR 15,000 each

- **UG Students:** Up to INR 50,000
- **PG Students:** Up to INR 70,000
- **UG Students from IITs:** Up to INR 2,00,000
- **MBA Students from IIMs:** Up to INR 7,50,000

Last Date: 01-10-2024 ***Short Url:*** www.b4s.in/aj/SBIFS7

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/LAnmSITలో చదవండి.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పలు పంచాయతీల్లో ఇన్‌చార్జ్ పాలన

● గ్రామాల్లో కుంటుపడిన అభివృద్ధి
● 18 పంచాయతీలకు 10మంది ఇన్‌చార్జి కార్యదర్శులు

తెనాలి రూరల్, ఆగస్టు 21: తెనాలి మండలంలోని 18 గ్రామాల పరిధిలోని పంచాయతీల్లోని కార్యదర్శులు గ్రామంలోని పారిశుధ్యం, తాగునీరు ఇతర గ్రామ సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గ్రామస్థులకు ఇబ్బందులు లేకుండా పాలనాపరమైన బాధ్యతలు నిర్వహించడంలో కీలకంగా వ్యవహరిస్తారు. ఐతే గత కొంత కాలంగా పలు పంచాయతీల్లో ఇన్‌ఛార్జ్ కార్యదర్శులు పాలన కొనసాగుతోంది. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనుల కుంటుపడి ఎక్కడి సమస్యలు అక్కడే అన్నట్లుగా మారింది. మండలంలోని 18 పంచాయతీలకు గానూ దాదాపుగా 10 పంచాయతీలను ఇన్‌చార్జ్ కార్యదర్శులే పాలన బాధ్యతలు తీసుకుని కొనసాగిస్తున్నారు. దీంతో అటు వారు పనిచేసే గ్రామ పంచాయతీల్లో సమస్యలను పరిష్కరించలేక ఇన్‌చార్జ్‌గా ఉన్న పంచాయతీల సమస్యలపై దృష్టిపెట్టలేక సతమతమవుతున్నారు. మండలంలోని అంగలకుదురు గ్రామ పంచాయతీ కార్యదర్శి గుర్రం ప్రసాదరావు ఇన్‌చార్జ్ కార్యదర్శిగా సంగంజాగర్లమూడి పంచాయతీ బాధ్యతలు కూడా చేపట్టవలసి వచ్చింది. గత కొన్ని రోజులు కితం ఆయనకూడా మెడికల్ లీవ్‌లో ఉండటంతో పెదరావూరు గ్రామ కార్యదర్శి రామసుబ్బారావు అదనపు బాధ్యతలు చేపట్టాల్సి వచ్చింది. ఈ కార్యదర్శే కొలకలూరు కూడా ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించాల్సి ఉంది. దీంతో మొత్తం రామసుబ్బారావు నాలుగు పంచాయతీల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కఠెవరం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ గౌస్ మోహిద్దీన్ ఎరుకలపూడి, మల్లెపాడు, చావావారిపాలెం గ్రామ పంచాయతీల్లో ఇన్‌చార్జ్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నందివెలుగు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న జి.సుభాష్‌చంద్రబోస్ అదనంగా గుడివాడ, కోపల్లె గ్రామ పంచాయతీల్లో ఇన్‌చార్జ్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక సోమసుందపాలెం గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న వి.శ్రీనివాసరావు హాఫ్‌పేట పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా బాధ్యతలు నెట్టుకొస్తున్నారు. తేలప్రోలు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న టి.ఉమాదేవి నేలపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇలా మండలంలోని కార్యదర్శులు సొంత పంచాయతీలకు న్యాయం చేయలేక అదనపు బాధ్యతలు నిర్వహించలేక గ్రామాలను అభివృద్ధి పథంలో నడపలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో సైతం ఇన్‌ఛార్జ్ కార్యదర్శుల పాలన కొనసాగడంతో ప్రజలు సమస్యలు పంచాయతీలకు తెలుపుతున్నా అవి పరిష్కార దిశగా జరిపేందుకు సమయం అధికంగా పడుతుండటంతో గ్రామప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీసీఎం పవన్ కల్యాణ్‌లు గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేలా పాలన చేపడితే ఇక్కడ క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడంలేదని ఇప్పటికైనా తమ గ్రామాలను కార్యదర్శులను నియమించాలని ప్రభుత్వాన్ని విన్నవించుకుంటున్నారు.

డాక్టర్ బుడాన్‌సాహెబ్ మృతి



తెనాలి అర్బన్, ఆగస్టు 21: తెనాలికి చెందిన ప్రముఖ వైద్యుడు బుడాన్ సాహెబ్ (84) బుధవారం మరణించారు. గాంధీచౌక్ సమీపంలో వైద్యశాల ఏర్పాటుచేసి ఎన్నో ఏళ్ల వైద్య సేవలు అందించారు. పేదల వైద్యుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన కుమారుడు, కోడలు కూడా వైద్య రంగంలో స్థిరపడ్డారు. ఆయన మృతి కి పలువురు వైద్యులు సంతాపం తెలిపారు.



తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ ఉదయ్‌సుధీర్

చిరువ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ

తెనాలి అర్బన్, ఆగస్టు 21: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో బుధవారం మార్కెట్ యార్డులో 22 తోపుడు బండ్లు చిరువ్యాపారులకు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ ఉదయ్‌సుధీర్ పిలాని మాట్లాడుతూ సంపద సృష్టిలో చిరువ్యాపారుల పాత్ర ప్రముఖమైనదన్నారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా సొంత కాళ్లపై వ్యాపారం చేసుకోవడం అభినందనీయమన్నారు. అన్నే రత్నప్రభాకర్ మాట్లాడుతూ, తోపుడుబండ్లకు ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి రూ.లక్ష విరాళం అందించారని క్లబ్ మొయినాబాద్ నుంచి రూ.లక్షా 50వేలు విరాళం వచ్చిందన్నారు. రాజశేఖరరెడ్డి, శివరంజని, పెరుమాళ్లు, మురళీకృష్ణ, వెంకటరత్నం, ఈదర పూర్ణచంద్, రాంబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సామినేని కోటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న దాతలు

కేజేఎస్‌ఎస్‌కు రూ.6 లక్షలు పెదపూడి వాసుల విరాళం

గుంటూరు (తూర్పు), ఆగస్టు 21: జేకేసీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయానికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని కమ్మజన సేవ సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అన్నారు. నూతన భవన సముదాయంలో ఒక గది నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ.6 లక్షల విరాళాన్ని తెనాలి నియోజకవర్గం పెదపూడి గ్రామానికి చెందిన వేములపల్లి పావెల్, వేములపల్లి అల్యూష్‌లు బుధవారం బృందావన్ గార్డెన్స్ బాలికల వసతి గృహంలో ఆయనకు అందజేశారు. అనంతరం సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ దాతల సహకారంతో నూతన భవన నిర్మాణం మొదలైందని త్వరలోనే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. భవన నిర్మాణానికి దాతలు మరింతగా ముందుకు రావాలని కోరారు. దాతలు మాట్లాడుతూ వేములపల్లి బుల్లెమ్మ, నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందజేసినట్టు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, పాలకవర్గ సభ్యులు కన్నెగంటి బుచ్చయ్య చౌదరి. గోరంట్ల పున్నయ్య చౌదరి, గుంటుపల్లి కోటేశ్వరరావు, ఘంటా పున్నారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ అదాలత్‌లో మాట్లాడుతున్న చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేలు

విద్యుత్ సమస్యల పరిష్కారానికే అదాలత్: విక్టర్

తెనాలి అర్బన్, ఆగస్టు 21 : వినియోగదారుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ ఎస్.విక్టర్ ఇమ్మానుయేలు చెప్పారు. తెనాలి రీజియన్ కార్యాలయంలో బుధవారం అదాలత్ నిర్వహించారు. వినియోగదారులు ఫిర్యాదులను అందజేశారు. వీటిలో ఆరు ఫిర్యాదులను చైర్మన్ అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన ఫిర్యాదులలో సివిల్ వ్యవహారాలు ఉన్నందున ఫోరంను సంప్రదించాలని సూచించారు. మెరుగైన విద్యుత్ పంపిణీకి ఫోరం కృషి చేస్తుందని చెప్పారు. ఎస్‌ఈ మురళీకృష్ణ యాదవ్, ఈఈ చిరంజీవి, ఏడీఈలు పాల్గొన్నారు.

పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి

● మచిలీపట్నం ఎల్‌ఐసీ డివిజన్ కన్వీనర్ సీహెచ్ మధుబాల

గుంటూరు (తూర్పు), ఆగస్టు 21: పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలని మహిళా ఉద్యోగుల సమన్వయ కమిటీ, మచిలీపట్నం ఎల్‌ఐసీ డివిజన్ కన్వీనర్ సీహెచ్ మధుబాల అన్నారు. బుధవారం వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలపై దాడులను ఖండిస్తూ స్థానిక అమరావతి రోడ్డులోని ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణకు తీసుకొచ్చిన చట్టాల అమలుతీరు అత్యంత ఘోరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో భద్రతపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాలన్నారు. కోల్‌కత్తా వైద్యురాలిపై జరిగిన హత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వాణీకుమారి, టి.అనసూయారాణి, వి.భార్గవి, జికామేశ్వరి, డి.సుమ, డి.సైదులు, ఐ వెంకట్రావు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పిస్తాం

● ఎమ్మెల్యే నరేంద్ర కుమార్
● తాగునీటి సమస్యపై లబ్ధిదారుల ఆవేదన
● గృహ రుణాలపై వడ్డీ మాఫీ కోసం వినతి
● ఆకతాయిల బెడద నివారించాలని విజ్ఞప్తి



టిడ్కో గృహాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తదితరులు

పొన్నూరు టౌన్, ఆగస్టు 21: టిడ్కో గృహ సముదాయల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు. పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలులో నిర్మించిన టిడ్కో గృహాలను బుధవారం ఎమ్మెల్యే, కూటమి పార్టీల నాయకులు సందర్శించి లబ్ధిదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా కాలనీలో తాగునీటి సమస్య అధికంగా ఉండటంతో గృహాలు మంజూరైన లబ్ధిదారులు గృహాలను ఖాళీచేసి వెళ్లిపోతున్నామని లబ్ధిదారులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ఏజెన్సీ నిర్వాహకులను పిలిపించి తాగునీటి సమస్య పరిష్కారంపై చర్చించారు. నెలల తరబడి గృహ సముదాయాల్లో తాగునీటి సమస్య నెలకొంటే లబ్ధిదారుల జీవనం ఎలా అని ప్రశ్నించారు. ఏజెన్సీ నిర్వాహకులు పొంతలేని సమాధానం ఇవ్వటంతో వారిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు లబ్ధిదారుల గృహాల్లో ట్యాపులు వదిలి తాళాలువేసి వెళ్లిపోవటంతో ట్యాంక్‌లకు ఎక్కిన నీరు వృథాగా పోయి, నివసిస్తున్న వారికి నీరు అందటం లేదని లబ్ధిదారులు వాపోయారు. తక్షణమే ప్రతి బ్లాక్ బయట నీటి సరఫరా వాల్వులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రతి బ్లాక్‌ను సందర్శించి తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించారు. పారిశుధ్యంపై పలువురు లబ్ధిదారులు ఫిర్యాదులు చేశారు. అలాగే కొన్ని గృహాలు లబ్ధిదారులు విక్రయించటం, అద్దెకు ఇవ్వటం చేయటం వలన ఆ గృహాలో చేరిన బయట వ్యక్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని లబ్ధిదారులు ఆరోపించారు. అలాగే రాత్రిపూట వీధి లైట్లు ఏర్పాటు చేయకపోవటం వలన అసాంఘిక శక్తుల సంచారం అధికంగా ఉందని మహిళలు వాపోయారు. కాలనీలో మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించి అసభ్య ప్రవర్తనలకు పాల్పడుతున్నారని మహిళలు వాపోయారు. అలాగే లబ్ధిదారులకు మంజూరైన రుణాలకు సంబంధించి బ్యాంక్ చెల్లింపులపై అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని బ్యాంక్ అధికారుల వేధింపులు అధికంగా ఉన్నాయని మహిళలు వాపోయారు. వీటిపై స్పందించిన ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ పోలీసు పెట్రోలింగ్ నిర్వహించి ఆకతాయిల ఆకట్టించాలని ఆదేశించారు. అలాగే చెత్త సేకరణ చేయించి పారిశుధ్య సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. రుణాలకు సంబంధించి ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే లబ్ధిదారులు ఆరోపిస్తునట్లుగా ప్లాట్ల విక్రయాలు జరిపిన వారిపై చర్యలు తీసుకోవటమే కాకుండా ఆ ప్లాట్లను స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు తిరిగి అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపకులాల వర్గీకరణపై

సుప్రీం కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా బంద్





ఎస్సీ వర్గీకరణ నిలుపుదలచేయాలంటూ ఆందోళన చేస్తున్న పోరాట సమితి సభ్యులు, మార్కెట్ రోడ్డులో మూసి ఉన్న దుకాణాలు

తెనాలి రూరల్, ఆగస్టు 21: ఎస్సీ, ఎస్టీ ఉపకులాల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా సంఘర్ష్ సమితి రిజర్వేషన్ బచావో పేరిట భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. అందులో భాగంగా తెనాలిలో బంద్ పాక్షికంగా జరిగింది. వర్గీకరణ వ్యతిరేకపోరాట సమితి ఆధ్వర్యంలో ఉదయం పట్టణంలోని ఆర్టీసీ డిపోలోకి వ్యతిరేక పోరాటసమితి సభ్యులు వెళ్లి బస్సులను బయటకురాకుండా అడ్డుకుని ఎస్సీ రిజర్వేషన్‌ను సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణంలోని పలు వీధుల్లో ప్రదర్శనగా తిరుగుతూ దుకాణాలను మూయించారు. బ్యాంకులు తెరిచి ఉండటాన్ని గమనించి అక్కడ నిర్వాహకులతో మాట్లాడి మూయించారు. ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు ముందురోజే విద్యార్థులకు బంద్ సందర్భంగా శెలవు ప్రకటించారు. ప్రభుత్వ స్కూల్స్ నిర్వహిస్తుండగా వాటిని మూయించాలని హెచ్‌ఎంల వద్ద డిమాండ్ చేశారు. అనంతరం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రదర్శనగా వెళ్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీల ఐక్యతను చిచ్చుపెట్టేలా వర్గీకరణ తీర్పు ఉందని వెంటనే దానిని ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వర్గీకరణను ఉపసంహరించుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు. మధ్యాహ్నం నుంచి యధావిధిగా బస్సులు తిరిగాయి, దుకాణాలు కూడాతెరుచుకున్నారు. బంద్‌లో వర్గీకరణ వ్యతిరేకపోరాట సమితి నాయకులు బొనిగల ప్రదీప్, గడ్డేటి సుందర్‌రావు, ఎండ్రపాటి అశోక్, అక్కిదాసు కిరణ్‌కుమార్, అనీల్, పిల్లి ప్రేమ్‌రాజ్, ఏతాటి అనీల్, బడుగు రమేష్, కారుమంచి రవికుమార్, మందూరు రాజు, మేముల మహేష్, ఉన్నం నాని, నాగేశ్వరరావు, గురవయ్య, గంగాధర్, గిరిబాబు, రమేష్, ఏసుబాబు, సాల్మన్, రవిచంద్ర, చిక్కాల బెన్ని తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకం: జేఏసీ

పొన్నూరు టౌన్, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణ తీర్పు పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకం అని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం పొన్నూరు పట్టణంలో బంద్ నిర్వహించారు. పట్టణ ప్రధాన కేంద్ర ఐలాండ్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాల సంఘాల జేఏసీ నాయకులు నిరసన ప్రదర్శన సాగించారు. జేఏసీ యువత ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీలు నిర్వహించి వ్యాపార సముదాయాలు, వాణిజ్య బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలను మూయించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు స్వచ్ఛంద బంద్ పాటించారు. బంద్ సందర్భంగా ప్రయాణికుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని బాపట్ల, రేపల్లె ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతుండగా నిరసనకారులు ఆ బస్సులను అడ్డుకుని సర్వీసులు నిలిపివేయాలని హెచ్చరించారు. నిరసనకారులు నినాదాలు చేయటంతోపాటు బస్సుపై కర్రలతో దాడి చేయటానికి ప్రయత్నించగా బస్సులోని ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. పోలీసులు సకాలంలో స్పందించి నిరసన కారులను పంపించివేయటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. నిరసన కారులు ఐలాండ్ సెంటర్‌లో తిష్టవేసి సుప్రీం కోర్టుకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మల్లెల వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగిన బంద్‌లో పలు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. వర్గీకరణ నిర్ణయం వల్ల దళితుల మధ్య చిచ్చుపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణను అడ్డుకుని తీరుతామని ప్రతిజ్ఞ పూనారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పొందుగల చైతన్య, జంగా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పెదకాకానిలో హైవేపై ధర్నా

పెదకాకాని, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ పెదకాకానిలో రహదారిపై కొంతమంది ధర్నా నిర్వహించారు. బుధవారం పెదకాకాని హైవేపై బయట నుంచి పలువురు వాహనాలు అడ్డుకున్నారు. దీంతో హైవే కిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ధర్నాలో పాల్గొన్నారు.

వర్సిటీలో ఎన్‌డీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో...

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బంద్ చేపట్టారు. ఎన్‌డీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో వర్సిటీలను పలు కార్యాలయాలు మూయించారు. మెయిన్ గేట్ వద్ద ఆందోళన చేపట్టారు.

కొల్లిపరలో ...

కొల్లిపర, ఆగస్టు 21: భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ ఆదేశాలు జారీచేసి ఎస్సీ ఎస్టీ వర్గీకరణపై ఇచ్చిన అప్రజాస్వామిక చట్టవ్యతిరేక, రాజ్యాంగ విరుద్ధమైన తీర్పును నిరసిస్తూ బుధవారం మండలంలోని గ్రామాల్లో దళిత సంఘాల నాయకులు బంద్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో పిల్లి గంగాధర్, మండ్రు రాజు, బేతాళ భూషణం, పల్లె మధు, ఉన్నం నాని, బత్తుల రవికుమార్, పోకూరి విజయ, నాలాది బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



ఐలాండ్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జేఏసీ నాయకులు



మహాలక్ష్మి అమ్మవారికి సమర్పించనున్న శ్రావణ పట్టీతో భక్తులు

మహాలక్ష్మి అమ్మవారికి ఘనంగా శ్రావణ పట్టీ

పెదకాకాని, ఆగస్టు 21: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న శ్రీదశావతార వెంకటేశ్వరస్వామి దివ్య క్షేత్రంలో శ్రావణమాసం సందర్భంగా బుధవారం విజయవాడ వాస్తవ్యులు ఎల్‌ఈపీఎల్ ఆఫీస్ స్టాఫ్ దశావతార వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలోని మహాలక్ష్మి అమ్మవారికి శ్రావణ పట్టీ సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ కోగంటి వెంకటేశ్వరరావు, అర్చకులు పాల్గొన్నారు.

అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

● ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివసాంబిరెడ్డి

కొల్లిపర, ఆగస్టు 21: పశ్చిమ బెంగాల్ మెడికల్ కళాశాల ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపరలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్యపై వివిధ కార్మిక సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైద్యుల మీద జరుగుతున్న అఘాయిత్యాలు నిరోధించటానికి ప్రత్యేక చట్టాలు రూపొందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కోటా చంద్రశేఖర్, అంగన్‌వాడీ యూనియన్ మండల అధ్యక్షురాలు గడ్డం నిర్మలాజ్యోతి, వివిధ సంఘాల నాయకులు వి.విజయ, సునీలా, బసవయ్య, ఆర్.లక్ష్మి, లావణ్య, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.




కొల్లిపరలో నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు

నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలి

● సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకుల డిమాండ్

తెనాలి అర్బన్, ఆగస్టు 21: సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, బకాయిలు చెల్లించాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ డిమాండ్ చేశారు. బుధవారం అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ వేయాలన్నారు. ఉద్యోగులపై మాతృశాఖ అజమాయిషీ మాత్రమే ఉండాలని, మెరుగైన ఐఆర్‌ను ప్రకటించాలని, పదోన్నతులు కల్పించాలన్నారు. వివిధ విభాగాల సమస్యల పరిష్కారం కోసం 90 రోజుల గడువుతో కమిటీ ఏర్పాటుచేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు మణికంఠ, షేక్ జానీబాషా, అజయ్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పాల రైతులకు బోనస్ పంపిణీచేస్తున్న సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు

సంగం రైతులకు బోనస్ పంపిణీ

పొన్నూరు టౌన్, ఆగస్టు 21: సంగం డెయిరీ పాల రైతుల కోసం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ పాలకవర్గ సభ్యుడు బొర్రు రామారావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని పలు గ్రామాలలో పాల రైతులకు బోనస్ పంపిణీ కార్యక్రమం జరిగింది. దొప్పలపూడిలో 22మంది రైతులకు రూ.40వేలు బోనస్‌ను పంపిణీ చేశారు. ఎం.కృష్ణ సుమంత్ వెండర్ పాయింట్‌లో 50మంది రైతులకు రూ.63వేలు, గాయంవారిపాలెంలో సుబ్బారెడ్డి వెండర్ పాయింట్‌లో 57మందికి రూ.1.58లక్షలు, ఆరెమండ గ్రామంలో షేక్ సైదావలీ వెండర్ పాయింట్‌లలో 13మందికి రూ.31వేలు, కట్టెంపూడి యక్కటి రామయ్య వెండర్ పాయింట్‌లో 18మందికి రూ.35వేలు బోనస్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రామారావు మాట్లాడుతూ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సంగం పాల రైతుల సంక్షేమం కోసం పాటుపడుతున్నారన్నారు. రైతులకు, పశువులకు బీమా సౌకర్యం, పశుగ్రాసం, పశువైద్యం, రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. పాల రైతుల ఆరోగ్య రక్షణకు డీవీసీ హాస్పటల్ ద్వారా రాయితీపై వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ పాతూరి ఆదినారాయణ, సంగం సిబ్బంది, అధికారులు, పాల సొసైటీల నిర్వాహకులు, పాల రైతులు పాల్గొన్నారు.



మున్నంగిలో విషజ్వరాలపై ఇంటింటికి సర్వే చేస్తున్న వైద్యాధికారులు

మున్నంగిలో విషజ్వరాలపై ఇంటింటి సర్వే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొల్లిపర, ఆగస్టు 21: మండల పరిధిలోని మున్నంగిలో ప్రబలిన విషజ్వరాలపై ఇంటింటా జ్వరపీడితులు అంటూ ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురించతమైన కథనంపై వైద్యాధికారులు స్పందించారు. వైద్యాధికారులు గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించి, రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి అన్నపూర్ణాదేవి క్యాంపును సందర్శించి వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశాలతో ఐదు టీములుగా ఏర్పడి ఇంటింటికి తిరిగి జర్వరాలు, నీటి నిల్వలు, లార్వా సర్వే చేయించారు. దోమలు నియంత్రణపై, విషజ్వరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కలిగించారు. తెనాలి మలేరియా అసిస్టెంట్ అధికారి సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, సబ్‌యూనిట్ ఆఫీసర్ వంగల పున్నారెడ్డి పంచాయతీ వారి సాయంతో ఐఎస్ఎస్ ఇండోర్ స్పేస్ స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయించడం జరుగుతుందన్నారు. మెడికల్ క్యాంపులో మండల వైద్యాధికారి ప్రియాంక, ఎంపీఎంఈవో నాగరాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రావిపాటి మల్లికార్జునరావుకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

మృతులకు ఎమ్మెల్యే నివాళి

పొన్నూరు టౌన్, ఆగస్టు 21: మృతులకు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ బుధవారం నివాళి అర్పించారు. మండల పరిధిలోని చింతలపూడి గ్రామానికి చెందిన ప్రముఖులు రావిపాటి మల్లికార్జునరావు మంగళవారం మృతిచెందారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ బుధవారం మల్లికార్జునరావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన కుమారుడు ప్రవాసాంధ్రుడు రావిపాటి ఉదయ్‌ను పరామర్శించి సంతాపం తెలియజేశారు. అలాగే మల్లికార్జునరావు మృతదేహానికి పలు రాజకీయ పార్టీల నాయకులు, పొన్నూరు ప్రముఖులు నివాళులు అర్పించారు. అలాగే మండల పరిధిలోని మాచవరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త మొవ్వ బులయ్య ఇటీవల మృతి చెందగా బులయ్య గృహానికి వెళ్లి మృతుడి చిత్రపటానికి నరేంద్రకుమార్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బులయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



డీఎస్సీ మెటీరియల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

డీఎస్సీ అభ్యర్థులు సొంతగా నోట్స్ తయారు చేసుకోవాలి

● ఎమ్మెల్సీ లక్ష్మణరావు

తెనాలి అర్బన్, ఆగస్టు 21: డీఎస్సీ రాసే అభ్యర్థులు సొంతగా నోట్స్ తయారు చేసుకోవాలని, సిలబస్‌పై పూర్తి అవగాహన ఉండాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చెప్పారు. ఎన్జీవో కల్యాణ మండపంలో బుధవారం డీఎస్సీ రాయనున్న విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అభ్యర్థులు ప్రతిరోజూ వార్త పత్రికలు చదవాలని ముఖ్యమైన అంశాలను నమోదు చేసుకోవాలన్నారు. గత పరీక్షలలో వచ్చిన ప్రశ్నల విధానాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా సిద్ధం కావాలన్నారు. 120 పేజీల సైకాలజీ పుస్తకాన్ని ఆవిష్కరించి అభ్యర్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ప్రణాళికతో చదివి విజయం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కుర్రా శ్రీనివాసరావు, అహ్మద్ హుస్సేన్, గయాసుద్దౌలా, కేదార్‌నాథ్, సాంబశివరావు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

పొన్నూరు టౌన్, ఆగస్టు 21: ఈ నెల 22వ తేదీన సినీ నటుడు చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తునట్లు చిరంజీవి అభిమాన సంఘాల నాయకుడు మాదాసు అప్పారావు బుధవారం తెలిపారు. కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులు హాజరు కానునట్లు తెలిపారు.

డివిజన్ సర్వే సర్టిఫికెట్ల జారీకి ప్రత్యేక చర్యలు

గుంటూరు (కార్పొరేషన్), ఆగస్టు 21: సబ్ డివిజన్ సర్వే సర్టిఫికెట్ల జారీకి ప్రత్యేక చర్యలకు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు జేసీ భార్గవ్‌తేజ్, డిస్ట్రిక్ట్ రిజిస్టర్ డి.శైలజ, ఏడీ సర్వే వై.నాగశేఖర్, నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్‌తో కలసి బుధవారం సాయంత్రం కమిషనర్ ఛాంబర్ నందు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నగర పాలకసంస్థ, విలీన గ్రామాల్లో కొంతకాలంగా ఖాళీ స్థలాలకు సంబంధించిన సబ్ డివిజన్ సర్టిఫికెట్లు మంజూరు విషయంలో నగర ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యల శాశ్వత పరిష్కారం కోసం క్షుణ్ణంగా సమీక్షించి చర్యలు తీసుకున్నారు. ఇకపై నగరపాలక సంస్థ పరిధిలో 10విలీన గ్రామాల పరిధి లోని నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌కు సంబంధించిన టీఎస్ నెంబర్ డీ నెంబర్‌లకు సంబంధించిన ఖాళీ స్థలాలకు నగర పాలక సంస్థ సబ్ డివిజన్ సర్టిఫికెట్లు జారీ చేస్తుందన్నారు.